بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu) వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

సంపుటి: **7** సంచిక : **19**

వార్షిక చందా 575/-రూ॥

**12 మే, 2022 క్రీ, శ. 10 షవ్వాల్ 1443 హి, ఖ. 12 హిజ్రత్, 1401 హి, శ.**

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَمَنۡ اَظۡلَمُ مِمَّنِ افۡتَرٰی

عَلَی اللّٰہِ کَذِبًا اَوۡ کَذَّبَ بِاٰیٰتِہٖ ؕ

اِنَّہٗ لَا یُفۡلِحُ الظّٰلِمُوۡنَ ○

**అనువాదం:** అల్లాహ్‌కు అబద్ధమును అంటగట్టిన వాడు లేదా అతని సూక్తులను నిరాకరించు వాని కంటే అన్యాయుడు ఎవడుండ గలడు. నిశ్చయముగా అన్యాయులు విజయమును పొందలేరు.

**(అన్ఆమ్: 22).**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ

وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

---

దేవుడు సర్వశక్తివంతుడు. ఒకవేళ అతడు కోరుకున్నచో ఒక బక్కచిక్కిన వానికి కూడ ఉపవాసంను ఉండే భాగ్యంను కల్పించగలడు. కావున ఫిదియా యొక్క ఉద్దేశం కూడ మానవునికి శక్తి లభించడమే, ఇది దేవుని నుండే లభిస్తుంది.

## హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశములు:-

తమ శక్తి సామర్థ్యముల మేరకు దైవాదేశాలను ఆచరించుటయే మానవుని విద్యుక్త ధర్మం కావలెయును. ఉపవాసంను గూర్చి అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. వ అన్ తసూమూ ఖైరుల్లకుం (బఖ్రాహ్: 185) అనగా ఒకవేళ మీరు ఉపవాసంను పాటించినచో అది మీ కొరకు చాలా శ్రేయస్సుకరం అవుతుంది.

ఒకసారి నా మనస్సులో ఫిదియాను ఎందుకు విధించారు అనే ఒక ఆలోచన వచ్చింది. ఆలోచించగా అది భాగ్యమును పొందడం కోసమే అని అర్థమైనది. తద్వారా వారికి ఉపవాస భాగ్యం లభిస్తుంది. దేవుని ఉనికియే మానవునికి భాగ్యమును కల్పిస్తుంది. కావున ప్రతీది దేవున్నే యాచించవలెను. దేవుడు సర్వశక్తివంతుడు. ఒకవేళ అతడు కోరుకున్నచో ఒక బక్కచిక్కిన వానికి కూడ ఉపవాసంను ఉండే భాగ్యంను కల్పించగలడు. కావున ఫిదియా యొక్క ఉద్దేశం కూడ మానవునికి శక్తి లభించడమే, ఇది దేవుని నుండే లభిస్తుంది. కావున నాదృష్టిలో ఉన్నదేమనగా మనస్ఫూర్తిగా ఇలా దుఆ చేయండి. ఓ దైవమా! ఇది నీ శుభప్రదమైన మాసం. నేను భాగ్యాన్ని పొందలేకపోతున్నాను. వచ్చే సంవత్సరం వరకు ప్రాణాలతో ఉంటానో, ఉండనో ఎవరికి తెలుసు?. లేక మిగిలిపోయినా ఉపవాసంలను పూర్తి చేయగల్గుతానో లేదో ఎవరికి తెలుసు?. తద్వారా భాగ్యము లభిస్తుందని నేను ఖచ్చితముగా నమ్ముతాను. ఇలాంటి మనస్థత్వం గలవారికి అల్లాహ్ తాలా తప్పకుండా శక్తిని అనుగ్రహిస్తాడు.

ఒకవేళ అల్లాహ్ కోరినచో ఇతర సమాజీకుల వలే ఈ సమాజానికి కూడ ఎలాంటి నిబంధనలు విధించేవాడు కాదు. కాని అతడు మనకు లాభము చేకూర్చడం కోసమే ఈ నిబంధనలను విధించాడు. నా దృష్టిలో వాస్తవమేమనగా మానవుడు ఎప్పుడైతే సత్యతతో, సంపూర్ణ స్వచ్ఛతతో ఈ మాసపు శుభముల నుండి నన్ను దూరం చేయకుము అని విన్నవించుకున్నచో అల్లాహ్ తాలా అతనిని వాటి నుండి దూరం చేయడు. ఇలాంటి సంకల్పస్థితిలో వచ్చిన రమజాన్ మాసంలో ఒకవేళ అతడు అనారోగ్యమునకు గురైనచో అతని పక్షంలో కరుణా కురిపించబడును. ఎందుకనగా ప్రతి పనియొక్క ప్రతిఫలము దాని సంకల్పంపై ఆధారపడి ఉంటుంది. కావున ఒక విశ్వాసి తన వ్యక్తిత్వాన్ని తనకు తానుగా అల్లాహ్ మార్గంలో అర్పించుకోవలెను. ఏ వ్యక్తి అయితే ఉపవాసములు ఉండలేడో కాని అతని మనస్సులో బహుశా నేను అరోగ్యముగా ఉన్నచో తప్పకుండా ఉపవాసాలను పాటించేవాడిని అనే సంకల్ప బాధను కల్గి ఉంటాడో, అతని మనస్సు ఇందుకు బాధపడుచున్నచో అతని కోసం దేవదూతలు ఉపవాస వ్రతాన్ని పాటిస్తారు. ఇందుకు నిబంధన ఏమిటనగా కేవలం సాకును చూపకూడదు. అలా గైనచో అల్లాహ్ తాలా ఎన్నడు అతనిని పుణ్యఫలముల నుండి దూరం చేయడు.

(మల్ఫూజాత్ సంపుటి 3, పుట 426, ప్రచురణ 2018 ఖాదియాన్)

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(1904) హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా ఇలా తెలిపాడు: ఆదం కుమారుల ఉపవాసం కాకుండా మిగిలిన ప్రతి పని వారి కోసమే, కాని ఉపవాసం మాత్రం నా కోసం. అందుకు ప్రతిఫలంను కూడ నేనే. ఉపవాసం ఢాలు వంటింది. మీలో ఎవరైన ఉపవాసం ఉన్నచో వారు అసభ్య పదజాలం వాడకూడదు, అల్లరి చేయకూడదు. ఒకవేళ ఎవరైన మిమ్ములను దూషించినచో లేదా మీతో తగాదపడినచో వారితో నేను ఉపవాసం ఉన్నాను అని మాత్రవే అనండి. ముహమ్మద్ ప్రాణాలు ఏ దైవ అరచేతిలో ఉన్నాయో ఆ దైవ ప్రమాణం! నిశ్చయముగా ఉపవాసం పాటించు వ్యక్తి నోటి నుండి వచ్చు వాసన కస్తూరి వాసన కంటే ఎక్కువ అల్లాహ్‌కు ప్రీతికరమైనది. ఉపవాసం పాటించు వారికి రెండు సంతోషాలుంటాయి. ఒకటి అతడు ఉపవాసంను వీడిన సమయంలో కల్గు సంతోషం, రెండవది ఉపవాసం వలన అతడు అల్లాహ్‌ను కలుసుకున్నప్పుడు కల్గు సంతోషం. (సహి బుఖారి, కితాబుస్సౌమ్, సంపుటి 3, ప్రచురణ 2008, ఖాదియాన్).

---

ఒక విధముగా చూసినచో తక్కువ తినడం, తక్కువగా మాట్లాడడం, తక్కువ నిద్రించడం,మానవ సంబంధాలలో తగ్గింపు చేసుకోవడం వంటి నాలుగు ముఖ్యాంశాలు రమజాన్‌లో భాగమైనాయి. ఈ నాలుగు ఆంశాలే చాలా ముఖ్యమైనవి.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్హు ఇలా తెలిపారు:

ఉపవాసాల వలన కల్గు గొప్ప ప్రయోజనం ఏమిటనగా దాని ద్వారా మానవునికి సత్కార్యపు అభ్యాసమును భరించు అలవాటు పడుతుంది. మానవుడు ప్రపంచంలో ఎన్నో రకాల పనులు చేస్తుంటాడు. కష్టపడుతుంటాడు, శ్రమిస్తుంటాడు. అప్పుడప్పుడు పనిపాటు లేకుండా తిరుగుతుంటాడు. ఆవారగా తిరుగుతుంటాడు. గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. మానవుని మేథస్సు గాని, శరీరంగాని ఎప్పుడు ఖాళీగా ఉండదు. ఏదో ఒక పని మానవుడు తప్పకుండా చేస్తూనే ఉంటాడు. కాని వాటిలో కొన్ని అసభ్యకరమైన పనులుంటాయి, కొన్ని నష్టాన్ని కల్గించు పనులుంటాయి. కొన్ని మంచి పనులుంటాయి. మరికొన్ని చాలా మంచి పనులుంటాయి. కాని రమజాన్ మానవునికి ఎలాంటి పనులను నేర్పుతుందనగా, దాని వలనవారికి సత్కార్యములలో ఎదురయ్యే కష్టనష్టాలను భరించు సామార్థ్యం పెరుగుతుంది. మానవ జీవితంలో సు:ఖ సంతోషాలకు ఎలాంటి వస్తువుల అవసరం ఉంటుంది. కేవలం తినడం, త్రాగడం, పడుకోవడం, మానవ సంబంధాలు కొనసాగించడం. మానవ సంబంధాలే సమాజానికి ఉన్నత ఆదర్శం. ఆ క్రమంలోనే మిత్రులను కలుసుకోవడం, బంధువులతో అనుబంధాలను పెంచుకోవడం వంటివి వస్తాయి. మానవ సంబంధాలలో అందరికన్న సమీప అనుబంధం భార్యభర్తల అనుబంధం. కావున మానవసౌఖ్యం ఈ కొన్ని విషయాలతోనే ముడిపడి యున్నది. అనగా తినడం, త్రాగడం, పడుకోవడం, అనుబంధాలను పెంచుకోవడం. ఒక సూఫి ఇలా అన్నారు: సూఫి మత సాంప్రదాయానికి తక్కువ మాట్లాడడం, తక్కువగా భోజనం చేయడం, తక్కువగా పడుకోవడమే ప్రాణము. కాని రమజాన్ మాసంలో ఈ సూఫి మత సారాంశమంతయు యున్నది. తక్కువగా పడుకోవడం కూడ అందులో గలదు. ఎందుకనగా రాత్రివేళ తహాజ్జుద్ నమాజ్ కొరకు మేల్కొంటారు. తక్కువగా తినడం కూడ అందులో గలదు.

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం:-

(ఖిలాఫత్ దినోత్సవంను గూర్చి)

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ కోరినంత వరకు మీలో ప్రవక్తుత్వము స్థిరముగా నుండును. ఆ తర్వాత ప్రవక్తుత్వ పద్ధతిలో ఖిలాఫత్ (ఉత్తరాధికారిత్వము) ఏర్పడును. అది ప్రవక్త అడుగుజాడలో కొనసాగును. దానికి స్వప్రయోజనములు యుండవు. అది ప్రవక్త కార్యమును ముందుకు కొనసాగించును. కాని కొంత కాలము తరువాత ఈ ఖిలాఫత్ అనగా పవిత్రమైన ఈ ఖిలాఫత్ అంతమగును. ఈ వరము మీతో లాక్కొనబడును. తర్వాత ప్రజలు ఇబ్బందిని ఎదుర్కొను రాజరికము ఏర్పడును. అనంతరం దానిని మించి బలవంతము చేయు రాజరికము ఏర్పడును. అనంతరం అల్లాహ్ కరుణ ఉప్పొంగును. ప్రవక్తుత్వ పద్ధతిన మరల ఖిలాఫత్ ఏర్పడును.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 6 పుట 285, ముస్నదున్నూమాన్ బిన్ బషీర్ హదీస్ 18596, ఆలముల్ కుతుబ్ బేరూత్ 1998)

ఇస్లాం చరిత్రలోని వివిధ కాలములలో జరిగిన ముస్లిం ప్రభుత్వ పాలకులు తమను తాము ఖులఫాలని పిలిపించుకొన్నట్లు మనము చూడవచ్చును. వారి స్థాయి ఖలీఫాల స్థాయి అని వారు చెప్పుకునేవారు. అయినను అధిక ముస్లిములు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తర్వాత గడిచిన నలుగురు ఖలీఫాలకే పవిత్ర ఖలీఫాల స్థానమిత్తురు. వీరి కాలమే పవిత్ర ఖిలాఫత్ కాలముగా పరిగణించబడును. అనగా ఆ కాలము మార్గదర్శనము గలదై, మార్గదర్శనము వ్యాపింపజేయు కాలముగా యుండెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విధముగా వ్యవస్థను నడిపించినట్లు చూచిరో అదే విధముగా నడిపించిరి. పవిత్ర ఖుర్ఆన్ బోధనల ప్రకారము నడిపించిరి. వంశపారంపర్య రాజరికము యుండక విశ్వాసుల జమాఅత్ ద్వారా వారికి ఖిలాఫత్ బాధ్యతను అల్లాహ్ తఆలా అప్పగించెను. వారు తప్ప ఇతర ఖలీఫాలు వంశపారంపర్య రాజరికమునే కొనసాగించుచుండిరి. ఇటుల ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి అక్షరాల పూర్తి అయినది. భవిష్యవాణిలో మొదటి రెండు విషయములు పూర్తి అయినప్పుడు వారు తెలిపిన తుది విషయములో కూడ మన యజమాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిన విధముగనే పూర్తి కావలసియుండెను. ఈ ప్రాపంచిక, ముస్లిముల చెడిపోయిన పరిస్థితులను చూచి, ప్రళయ దినము వరకు కొనసాగు శాసనముతో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను పంపిన అల్లాహ్ కరుణ ఉప్పొంగి, ప్రవక్తుత్వ విధానములో ఖిలాఫత్‌ను ఏర్పరచ వలసి యుండెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో చేసిన వాగ్దానము మేరకు అల్లాహ్ తాలా తన కరుణను ఉప్పొంగించెను, మన యజమాని, నాయకుని వాక్కును పూర్తి చేయుచు మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్ ద్వారా ప్రవక్తుత్వ విధానములో ఖిలాఫత్‌ను ఏర్పరచెనని అహ్మదీయులైన మనము నమ్ముతాము. వారిని ఒక వైపు సమాజ ప్రవక్తగా అనుగ్రహించి మరో వైపు సర్వోత్తమ ఖలీఫాగా సత్కరించెను. తద్వారా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖిలాఫత్ పరంపర ఇక ముందు ప్రళయ దినము వరకు వారి సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు, సర్వోత్తమ ఖలీఫా ద్వారనే కొనసాగవలసి యుండెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తుత్వ విధానములో ఏర్పడు ఖిలాఫత్ గురించి గల ఈ భవిష్యవాణితో భాగము పొందుచున్నందున మనము అదృష్టవంతులము. జుమా అధ్యాయములోని సూక్తి وَّاٰخَرِيۡنَ مِنۡهُمۡ لَمَّا يَلۡحَقُوۡا بِهِمۡ ؕ వివరణలో తర్వాత వచ్చే వారిని మొదటి వారితో కలిపిన వారిలో మనము యున్నాము. తమ చిరంజీవి విశ్వాసమును ఆకాశము నుండి భూమిపై తీసుకొచ్చునని (సహీ అల్ బుఖారి కితాబుత్తఫ్సీర్ సూరతుల్ జుమా బాబ్ ఖౌలుహు వఆఖరీన మిన్‌హుమ్ 4897) వారు చెప్పిన వ్యక్తిని నమ్మిన వారిలో మనందరిని చేర్పించెను. ఏ మసీహ్, మహ్దికి సలాం అందించుమని వారు చెప్పినారో (ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 3 పుట 182, ముస్నద్ అబీహురైరహ్ హదీస్ 7957, ఆలముల్ కుతుబ్ బేరూత్ 1998) దాని ప్రకారము ఈ బాధ్యతను నెరవేర్చినవారిలో మనము యున్నాము. ఈ బాధ్యతను నిర్వర్తించువారిలో చేరుటకు అల్లాహ్ తఆలా మనలను అనుగ్రహించెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనంతరం ఏర్పడిన ఖిలాఫత్‌ను విశ్వసించే అహ్మదియ్య జమాఅత్‌లో మనము చేరుట పూర్తిగా అల్లాహ్ అనుగ్రహమే.

కనుక అల్లాహ్ తఆలా ఈ అవతారున్ని నమ్మేవారికి తప్పనిసరి అయిన మార్పులను తమ స్థితులలో కల్పించుకొనుటను అల్లాహ్ తాలా ద్వారా కలిగిన ఈ శుభములన్నిటికి కృతజ్ఞతగా ఆశించును. అప్పుడే ఈ బైఅత్ హక్కును చెల్లించగలము. మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్ విశ్వాసమును ఆకాశము నుండి భూమిపై తీసుకరావలసియుండెను. తనను నమ్మేవారి హృదయాలను దానితో నింపవలసి యుండెను. వారి కార్యమును నిశ్చయముగా చేసి చూపినారని ప్రతి అహ్మదీ ఇందుకు సాక్షి. కాని ఆ విశ్వాసమును స్థిరపరచుట వారి జీవితము వరకు మాత్రమే పరిమితము కాదు. లేదా కొన్ని దశాబ్దముల వరకు మాత్రమే పరిమితం కాదు. ప్రవక్తుత్వ విధానములో ఖిలాఫత్ ఏర్పడునని శుభవార్త అందించిన తరువాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మౌనము పాటించిరనగా ప్రళయ దినము వరకు విశ్వాసమును భూమిపై అద్భుతముగా, గొప్పగా స్థిరపరచవలసిన అవసరము గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్అలైహిస్సలాం బైఅత్‌లో తనను తాను చేర్చు ప్రతి అహ్మదీ ఈ విశ్వాసమును తమ హృదయములలో సదా స్థిరపరచుకొనుట కర్తవ్యము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత వారి పద్ధతిన కొనసాగుచున్న ఖిలాఫత్‌తో బంధము ఏర్పరచుకొని ఆ విశ్వాసమునకు ప్రతిరూపమై దానిని ప్రపంచ కోణములకు అందించుట నమ్మేవారి బాధ్యత. అందుకే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తాను ఈ ప్రపంచమును వీడు బాధాకరమైన వార్త జమాఅత్‌నకు అందించుచు ఇట్లు శుభవార్త కూడ అందించిరి. "వ్యతిరేకుల రెండు అసత్య సంతోషములను నిర్వీర్యము చేయుటకు ఆది నుండి రెండు శక్తులను చూపుట అల్లాహ్ తఆలా సాంప్రదాయము. ఇప్పుడు అల్లాహ్ తఆలా తన ప్రాచీన పద్ధతిని వీడుట అసాధ్యము". ఇట్లనిరి. "కనుక మీరు ద్వితీయ శక్తిని కూడ చూడుట అనివార్యము. దాని రాక మీకు మేలు కలిగించును. ఎందుకనగా అది శాశ్వతమైనది. ప్రళయ దినము వరకు అది అంతము కాదు".

(రిసాలా అల్‌వసియ్యత్ - రూహాని ఖజాయిన్ సంపుటి 20 పుట 305)

విశ్వాసమును భూమిపై స్థిరపరచుటకు అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత ఈ ద్వితీయ శక్తిని జారీ చేసెను. ధర్మము ప్రపంచము నుండి మరల అంతమైనదని వ్యతిరేకులు ఆనందపడుట అల్లాహ్ తఆలాకు ఇష్టము లేదు. షైతాన్ నిరాటంకంగా సంహరించుట అల్లాహ్ తఆలాకు ఇష్టము లేదు. అసత్య సంతోషములను అల్లాహ్ తఆలా రూపుమాపును. ఇందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత జారీ అయిన ఖిలాఫత్ వ్యవస్థ ద్వారా విశ్వాసమును స్థిరపరచును. ఈ విశ్వాసమును ప్రపంచములో స్థిరపరచుటకు ఖిలాఫత్ సహాయకులుగా ఈ వ్యవస్థతో ముడిపడియున్నామని ప్రకటించువారి బాధ్యత. మనము మన విశ్వాసమును కూడ రక్షించుకోవలెను, ఇతరులకు కూడ విశ్వాస కాంతిని స్పష్టము చేయాలని తమ బైఅత్ ప్రతిజ్ఞను దృష్టియందుంచుకొని దృఢమైన సంకల్పము చేయవలసిన అవసరమున్నది. తాను రెండు రెండు శక్తులను ప్రదర్శించుట అల్లాహ్ తఆలా ప్రాచీన సాంప్రదాయమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. ఈ ద్వితీయ శక్తి ఖిలాఫత్ వ్యవస్థ అని మనము బాగుగా ఎరుగుదుము. కనుక ఖిలాఫత్ వ్యవస్థకు ధార్మిక అభివృద్ధితో దృఢమైన సంబంధము గలదు. ఇది ఇస్లామీయ శాసనములో ఒక ముఖ్యమైన భాగము. ధార్మిక అభివృద్ధి ఖిలాఫత్ లేనిదే కానేకాదు. జమాఅత్ ఐక్యత ఖిలాఫత్ లేనిదే నిలువలేదు. ఖిలాఫత్‌తో సంబంధమున్న మనలోని ప్రతి ఒక్కరికి ఖిలాఫత్ కొనసాగుట విశ్వాసములోని భాగమను విషయము అల్లాహ్ తఆలా కృపానుసారము తెలుసు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు అన్‌హు పరమపదించినప్పుడు కుట్రను లేవనెత్తిన వారి మాటలను ఖండించినవారు కూడ ఈ విషయమును బాగుగా తెలిసియుండిరి. మనలో ఖిలాఫత్ వ్యవస్థ లేనిచో మన విశ్వాసము కొనసాగలేదని వారికి తెలిసియుండెను. అల్లాహ్‌కు కృతజ్ఞతలు ఎందుకనగా వారి త్యాగముల వలన, విశ్వాసములో వారికి గల దృఢత్వము వలన ఆ మహానుల సంతానమైన మనలోని అధికులు ఖిలాఫత్ వ్యవస్థతో ప్రయోజనము పొందుచున్నాము. ఈ విషయములో అందరి కంటే ఎక్కువ ప్రయత్నము, త్యాగము హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్‌హు చేసిరి. ఆరోపితులు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్‌హుపై పెద్ద పెద్ద ఆరోపణలు చేసినారు. ఖిలాఫత్ వ్యవస్థను రక్షించుటకు వారి హృదయములో గల స్థితికి ఒక ఉదాహరణను నేను హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) పదములలోనే మీకు తెలిపెదను. ఎందుకనగా ఇది కూడ చరిత్రలోని భాగము. పీడనముల నుండి దూరముండుటకు మనము చరిత్రను కూడ తిరగవేయవలెను. ఇదే విధముగా విశ్వాసము కూడ దృఢమగును.

(10వ పేజిలో చదువుము)

# జుమా ప్రసంగము

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహ్ తాలా అన్‌హు జీవిత స్థితిగతులను గూర్చి మరియు జకాత్‌ను తిరస్కరించువారి విషయంలో వారి రజి అభిప్రాయములను, వారితో వ్యవహరించు విధానంను గూర్చిన ప్రస్తావన కొనసాగుతుంది. ఈ ప్రస్తావనను గూర్చిన మిక్కిలి వివరణ తారీఖే తిబ్రిలో ఈ విధముగా ఉన్నది. అసద్ మరియు ఘత్ఫాన్ మరియు తై తెగలవారు తులైహా బిన్ ఖువైలద్ తెగకు చెందిన అసత్య ప్రవక్తుత్వ ప్రకటన చేసిన వ్యక్తి వద్ద ఏకమైయ్యారు. కేవలం కొంత మంది మాత్రమే ఏకం కాలేదు. అసద్ తెగవారు సమీరఆ ప్రాంతంలో ఏకమయ్యారు.

హజ్రత్ అబూబకర్ రజి నాయకత్వం, మార్గదర్శకంలో జకాత్‌ను తిరస్కరించు వారిని శిక్షించిన తరువాత ఇతర బలహీన తెగలవారు, చంచల తత్వం గల తెగల వారు ఒకరి తరువాత మరొకరుగా జకాత్‌ను తీసుకొని మదీనాకు చేరుకోవడం ప్రారంభించారు. బలమైన తెగల పరిస్థితియే భయనీయంగా ఉన్నదని గ్రహించిన బలహీన మరియు జకాత్‌ను తిరస్కరించిన తెగలవారు జకాత్‌ను తీసుకొని మదీనాకు రావడం మొదలు పెట్టారు. కొన్ని తెగల వారు రాత్రివేళ జకాత్ తీసుకరాగా, మరి కొన్ని తెగల వారు అర్థ రాత్రి జకాత్‌ను తీసుకవచ్చేవారు. మరి కొన్ని తెగలవారు తెల్లవారు సమయంలో జకాత్‌ను తీసుకవచ్చేవారు.

నేను ముందు నుండే తెల్పినట్లుగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రపంచం కోసం దుఆలు చేయండి. దుఆలలో అలసత్వం చూపకండి. ప్రత్యేకించి ప్రపంచీకులు తమ సృష్టికర్తను గుర్తుంచాలని దుఆ చేయండి. ప్రపంచాన్ని వినాశనం నుండి కాపాడడానికి ఇదొక్కటే మార్గం. అల్లాహ్ తాలా కరుణించుగాకా! మన దుఆలను స్వీకరించుగాకా!.

ఇప్పుడు నేనొక మృతుని గూర్చి ప్రస్తావించెదను. జుమా తరువాత వారి జనాజ నమాజ్‌ను కూడ చదివించెదను. వీరు గౌరనీయులైన మౌలాన ముబారక్ నజీర్ గారు. కెనడాలో ఉన్నటు వంటి జామిఅ అహ్మదియ్య ప్రిన్సిఫల్. పైగా ముబల్లిఘ్ ఇంచార్జ్ కెనడా కూడ. మార్చి 8వ తేదిన వీరు 87 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 18 మార్చి 2022, (18 అమాన్ 1400 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహ్ తాలా అన్‌హు జీవిత స్థితిగతులను గూర్చి మరియు జకాత్‌ను తిరస్కరించువారి విషయంలో వారి రజి అభిప్రాయములను, వారితో వ్యవహరించు విధానంను గూర్చిన ప్రస్తావన కొనసాగుతుంది. ఈ ప్రస్తావనను గూర్చిన మిక్కిలి వివరణ తారీఖే తిబ్రిలో ఈ విధముగా ఉన్నది. అసద్ మరియు ఘత్ఫాన్ మరియు తై తెగలవారు తులైహా బిన్ ఖువైలద్ తెగకు చెందిన అసత్య ప్రవక్తుత్వ ప్రకటన చేసిన వ్యక్తి వద్ద ఏకమైయ్యారు. కేవలం కొంత మంది మాత్రమే ఏకం కాలేదు. అసద్ తెగవారు సమీరఆ ప్రాంతంలో ఏకమయ్యారు. సమీర అనేది ఆద్ జాతికి చెందిన ఒక వ్యక్తి పేరుతో ఆ ప్రాంతానికి నామకరణం చేశారు. ఈ ప్రాంతం మక్కా మార్గంలో ఉన్నది. ఈ ప్రాంతానికి నలువైపుల నల్లటి గుట్టలు ఉన్నాయి. ఆ కారణం చేత కూడ ఈ ప్రాంతానికి ఆ పేరు పెట్టారు. ఫజార మరియు ఘత్ఫాన్ ప్రజలు తమ మిత్రపక్షకులైన తీబ ప్రాంతానికి దక్షణ దిశలో ఏకమయ్యారు. తై తెగవారు తమ ప్రాంతపు సరిహద్దులో ఏకమైయ్యారు. సఅలబ బిన్ సఅద్ మరియు ముర్రతు మరియు అబ్‌స తెగల వారు వారి మిత్ర పక్షకులతో రబజ ప్రాంతంలో అబ్‌రఖ్ వద్ద ఏకమయ్యారు. రబజ కూడ మదీనా నుండి మూడు రోజుల ప్రయాణం దూరంలో ఉన్నటు వంటి లోయ ప్రాంతం. అబ్‌రక్, అర్రబజ తెగల వారు బనూ జుబ్‌యాన్ ప్రాంతంలో ఉన్నారు. బనూ కినానకు చెందిన కొందరు ప్రజలు కూడ వచ్చి వారిలో కలిసిపోయారు. ఆ ప్రాంతం వారికి సరిపోలేదు అందుకే వారు రెండు గుంపులుగా విడిపోయారు. వాటిలో ఒక గుంపు అబ్‌రక్ ప్రాంతంలో బస చేయగా, రెండవది జుల్ ఖస్స ప్రాంతానికి వెళ్ళిపోయినది. జుల్ ఖస్సా ప్రాంతం కూడ మదీనా నుండి 40 మైళ్ళ దూరంలోనే ఉన్నది. తులైహా తెగవారు హిబాల్ తెగవారిని వారికి సహాయం అందించుటకు పంపించారు. హబాల్ తులైహా సోదరుడి కుమారుడు. మొత్తానికి ఈ విధముగా హిబాల్ జుల్ ఖస్స తెగవారికి నాయకుడైనాడు. అక్కడే అసద్ మరియు లైత్ దీల్ మరియు ముద్‌లిజ్ తెగల వారి మిత్రపక్షకులు కూడ ఉన్నారు. ఔఫ్ బిన్ ఫులాన్ బిన్ సినాన్, అబ్‌రఖ్ ప్రాంతంలోఉన్నటు వంటిముర్ర తెగల వారికి నాయకుడైనాడు. సఅలబ మరియు అబ్‌స తెగల వారిపై హారిస్ బిన్ ఫులాన్ నాయకుడిగా నియమించబడ్డాడు. ఇతడు బనూ సుబైయి తెగకు చెందినవాడు. ఈ తెగల వారు తమ బృందాలను మదీనాకు పంపాయి. ఈ తెగల వారందరు తమకు అనువైన చోట గుడారాలు వేసుకొని తమ బృందాలను పంపించారు. ఆ బృంద సభ్యులు కూడ వచ్చి మదీనాలో తమకు మద్దతు తెలిపే వారి ఇళ్ళలో బస చేశారు. హజ్రత్ అబ్బాస్ రజి కాకుండా మిగిలిన వారందరు వారిని తమ అతిథులుగా స్వీకరించారు. మేము నమాజ్ సల్పుతాము కాని జకాత్‌చెల్లించము అనే నిబంధనతో వారిని హజ్రత్ అబూబకర్ రజి ముందు ప్రవేశపెట్టడం జరిగింది. అల్లాహ్ తాలా అబూబకర్ రజికు సత్యంపై నిలబడే ధైర్యాన్ని ఇచ్చాడు. కావున హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు: ఒకవేళ వీరు ఒంటెను కట్టివేసే త్రాడును ఇవ్వడానికి నిరాకరించిన కూడ నేను వారితో యుద్ధం చేస్తాను.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 254-255, హిజ్రి 11వ సంవత్సరం. మక్తబతు దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2012) (అస్సిరతున్నబవియ్యతు లి ఇబ్నే హష్షామ్, పుట 434, అనుబంధం. దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2001) (ముఅజముల్ బల్దాన్, సంపుటి 3, పుట 67, 290, సంపుటి 1, పుట 89, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్) ( ఫ్రాంగ్ సీరత్, పుట 236, జవార్ అకాడమీ, పబ్లికేషన్స్ కరాచి 2003)

హజ్రత్ అబూబకర్ రజి అబూబకర్ రజి సిద్ధాంతంను విన్న తరువాత జకాత్‌ను తిరస్కరించు బృందాలు మదీనా నుండి తిరిగి వెళ్ళుచున్నప్పుడు ఆ సమయంలో వారి హావభావాలు ఎలా ఉన్నాయి? అనే విషయాన్ని ప్రస్తావించుతూ చరిత్రకారులు ఈ విధముగా పేర్కొన్నారు. ఆ బృంద సభ్యులు వారి రజి పట్టుదలను చూసి మదీనా నుండి వెళ్ళిపోమారు. కాని మదీనా నుండి వెళ్ళునప్పుడు రెండు విషయాలు వారి మెదడులో కదలాడుచున్నాయి. ఒకటి జకాత్‌ను నిషేదించు విషయంలో చర్చలు విఫలమయ్యాయి. ఈ క్రమంలో ఇస్లాం ఆదేశాలు ఎంతో స్పష్టముగా ఉన్నాయి. కావున ఖలీఫా తమ పట్టుదల నుండి ఏ మాత్రం వెనుకకు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ప్రత్యేకించి ముసల్మానులు స్పష్టమైన ఆదేశాలను సాక్షాలుగా చూసిన తరువాత అబూబకర్ రజి అభిప్రాయాన్ని ఏకీభవించారు. అంతేగాకా హజ్రత్ అబూబకర్ రజికు సహాయం అందించుటకు అన్ని విధాలుగా సిద్ధముగా ఉన్నారు. ఇక రెండవ విషయానికి వచ్చినచో అంతర్గత పరిస్థితులు అనగా ముసల్మానుల బలహీనతలు మరియు సంఖ్యాపరంగా తక్కువగా ఉండడం. కావున వీటిని తమ అదృష్టముగా భావిస్తూ మదీనాపై ఎంత వేగంగా మెరుపుదాడి చేయాలనగా ఆ దాఢి ఫలితముగా ఇస్లామీయ ప్రభుత్వం పడిపోవాలి మరియు ఇస్లాం ధర్మం కూడ కనుమరుగు కావాలి.

(సయ్యదినా అబూబకర్ వ్యక్తిత్వం, వ్యవహారం, రచయిత డాక్టర్ అలీ ముహమ్మద్ సిలాబి, పుట 278, మక్తబ అల్ ఫుర్ఖాన్ ముజఫర్ ఘడ్ పాకిస్తాన్)

ఇవి వారి ఆలోచనలు. ఏ విధముగా ఆధీన పర్చుకోవాలి. మొత్తానికైతే వారు తమ తెగల వద్దకు చేరుకొని ఇలా అన్నారు. ప్రస్తుతం మదీనాలో చాలా తక్కువ మంది ఉన్నారు. కావున ఇప్పుడే వారిపై దాఢి చేయాలి అని ప్రోత్సహించారు.

అటువైపు చూసినచో హజ్రత్ అబూబకర్ రజి కూడ ఈ విషయంలో ఏ మాత్రం ఎమరుపాటుగా లేకుండెను. ఈ బృందాలు తిరిగి వెళ్ళిపోగానే వారు రజి మదీనాకు చెందిన అన్ని కూడల్లలో క్రమబద్ధముగా కాపాల దారులను నియమించారు. ఈ కార్యక్రమం కోసం హజ్రత్ అలీరజి, హజ్రత్ జుబైర్ రజి, హజ్రత్ తల్హా రజి, మరియు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ రజిలను నియమించారు. మరొక కథనములో ఈవిధముగా గలదు. హజ్రత్ సఅద్ బిన్ వఖాస్ రజి మరియు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ల పేర్లు కూడ ఉన్నాయి. వీరు కూడ కూడలిలో కాపాల ఇవ్వడం కోసం నియమించబడ్డారు. ఇదియే గాకుండా హజ్రత్ అబూబకర్ రజి మదీనా వాసులందరు మస్జిద్‌లో ఏకం కావాలని ఆదేశించారు. ఆపై వారితో ఇలా అన్నారు. భూభాగం అవిశ్వాసులతో నిండిపోయింది. వారి బృందాలు మీ తక్కువ సంఖ్యను చూసి వెళ్ళారు. వారు పగటి వేళలో లేదా రాత్రివేళలో అకస్మత్తుగా దాఢి చేయవచ్చును. ఈ విషయంలో మీరు ఎమరుపాటుగా ఉండవచ్చును. అ అవిశ్వాసుల సమూహం ఒకటి ఇక్కడి నుండి ఒక బురైద్ అనగా 12 మైళ్ళ దూరంలోనే ఉన్నది. వారి షరతులను అంగీకరించి, వారితో ఒప్పందం చేసుకున్నచో బాగుండునని కొందరు భావించారు. కాని మేము వారి షరతులను అంగీరించలేదు. వారి షరతులను తిస్కరించాము. కావున ఇక మీరు వారితో యుద్ధం చేయుటకు పూర్తి స్థాయిలో సిద్ధం కండి అని అన్నారు. హజ్రత్ అబూబకర్ రజి అంచనా వంధ శాతం నిజమైనది. జకాత్‌ను తిరస్కరించు వారు మదీనా నుండి వెళ్ళిపోయినా తరువాత కేవలం మూడు రోజుల తరువాత ఒక రాత్రివేళ అకస్మత్తుగా వారు మదీనాపై దాఢిచేశారు.

తమ మిత్రపక్షకులలో కొందరిని వారు జుహిస్సా ప్రాంతంలో వదిలి పెట్టి వచ్చారు. అవసరం వచ్చిన ప్పుడు వారి సైన్యంను పిలిపించి సహాయం తీసుకోవచ్చని భావించారు. జుహుస్సా ప్రాంతం బనూ ఫజార తెగల వారు నీళ్ళు తెచ్చుకోను ప్రాంతం. ఈ ప్రాంతం రబజ మరియయు నఖల్ ప్రాంతాల మధ్యలో ఉన్నది. మొత్తానికి దాఢి చేయు ఈ సైన్యాలు రాత్రివేళ మదీనా కూడళ్ళకు చేరుకున్నాయి. కాని ముందు నుండి యుద్ధవీరులు సిద్ధముగా ఉన్నారు. వారి వెనుక మరి కొందరు ఉన్నారు. వారు ఎత్తైన ప్రదేశాలలో ఉన్నారు. కాపాల దారులు వారి వెనుక ఉన్నవారికి శత్రువుల రాకడను గూర్చి సమాచారం ఇచ్చారు. వారు శత్రువుల సమాచారంను హజ్రత్ అబూబకర్ రజికు అందించడం కోసం కొంత మందిని పంపారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి అందరు మీ మీ నిర్ణయిత ప్రాంతంలో ఉంటూనే యుద్ధం చేయండి అని సందేశాన్ని పంపారు. కావున సైనికులు అలాగే ఆచరించారు. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి మస్జిద్‌లో ఉన్నటు వంటి ముసల్మానులను తమ వెంట తీసుకొని ఒంటెలపై వారికి సహాయం అందించుటకు బయలు దేరినారు. శత్రువులు ఓడిపోయారు. ముసల్మానులు తమ ఒంటెలపై వారిని వెంబడించారు. ఈ క్రమంలోనే వారు జుస్సా ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఉన్నటు వంటి విద్రోహుల మరొక సైన్యం తోలు నీటి సంచులలో గాలిని నింపి త్రాళ్ళతో వాటిని కట్టి ముసల్మానులతో పోరాడుటకు ముందుకు వచ్చారు. ఆపై వారు ఆ సంచులను ఒంటెల ముందు తమ కాళ్ళతో త్రొక్కేవారు. సాధారణముగా ఒంటెలు ఇలాంటి చర్యలకు భయపడిపోతుంటాయి. కావున వారి అట్టి చర్యలకు ఒంటెలు భయపడి వెనుతిరిగి పరుగులు తీసాయి. ముసల్మానులు ఎంత అదుపు చేయుటకు ప్రయత్నించినా కూడ అదుపు చేయలేక పోయారు. చివరికి వారు ఆ స్థితిలోనే మదీనా చేరుకున్నారు. ఈ క్రమంలో ముసల్మానులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వారికి ఎలాంటి యుద్ధ సంపద లభించలేదు.

ముసల్మానుల ఈ పరుగుల చూసి శత్రువులు ముసల్మానులు బలహీనులు అని, వారికి శత్రువులను ఎదుర్కొనే శక్తి లేదని భావించారు. ఈ ఆలోచనతోనే శత్రువులు జుస్సా ప్రాంతంలో ఉన్నటు వంటి తమ మిత్రపక్షకులకు ఈ విషయాన్ని తెలిపారు. ఆ విషయాన్ని నిజమని నమ్మిన మిత్రపక్షకులు శత్రువులతో కలసి మరల దాఢికి దిగారు. కాని వారి కోసం అల్లాహ్ వేరొక తీర్మానాన్ని నిశ్చయించుకొని వారిని శిక్షించాలనుకున్న విషయం వారికి తెలియదు పాపం. రాత్రివేళ మొత్తం హజ్రత్ అబూబకర్ రజి తమ సైన్యాన్ని క్రమబద్ధీకరించుటలో నిమగ్నమైపోయారు. రాత్రి వేళ ఏర్పాట్లు అన్ని చేసుకొని వేకువ జామున క్రమబద్ధీకరించిన సైన్యాన్ని తీసుకొని కాలినడకన బయలు దేరినారు. నూమాన్ బిన్ ముఖ్రిన్ కుడివైపు సైన్యానికి, అబ్దుల్లాహ్ బిన్ ముఖ్రిన్ ఎడుమవైపు సైన్యానికి సువైద్ బిన్ ముఖ్రిన్ వెనుకబాగపు సైన్యానికి పర్యవేక్షకులుగా ఉన్నారు. వారితో పాటు మరికొందరు సవారీలు కూడ ఉన్నారు. తెల్లవారక ముందే ముసల్మానులు మరియు జకాత్‌ను తిరస్కరించు వారు ఉన్నటు వంటి మైదానంలోకి చేరుకున్నారు. ముసల్మానులు ఏ చిన్న కదలికను కూడ వారు తెలుసుకోలేక పోయారు. వారు ఆశ్చర్యంలో నుండి తేరుకునేలోగా ముసల్మానులు వారిని తమ ఖడ్గాలతో అంతమొందించారు. అనగావేకువజామునే యుద్ధం జరిగింది.

సూర్యదయం కాక ముందే తిరస్కరులు ఒటమిని చవి చూసి యుద్ధ మైదానం నుండి పారిపోయారు.

మరల ఇలా లిఖించారు: ముసల్మానులు వారి జంతువులన్నింటిని ఆధీన పర్చుకున్నారు. ఈ యుద్ధంలో హిబాల్ చనిపోయాడు. హజ్రత్ అబూబకర్ రజి వారిని వెంబడించారు. అలా వెంబడిస్తూనే వారు రజి జుల్ ఖస్సాకు చేరుకున్నారు. అల్లాహ్ తాలా ముసల్మానులకు అందించిన మొదటి విజయం ఇది. హజ్రత్ అబూబకర్ రజి నూఅమాన్ బిన్ ముఖ్రిన్‌కు కొంత మందిని ఇచ్చిఅక్కడే కాపాలా ఉండమని ఆదేశించి మిగిలిన వారితో వారు రజి మదీనాకు తిరిగి వచ్చారు. ఇది తారీఖే తిబ్రికి చెందిన ఆధారం. (తారీఖే తిబ్రి సంపుటి 2, పుట 255-256, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్2012)(అల్ బిదాయతు వన్నిహాయతు సంపుటి 3, భాగం 6, పుట 308, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ 2001)(అల్ ముంజిద్ బర్ద్ పద అర్థం) (ముఅజముల్ బల్దాన్ సంపుటి 2, పుట 297, అల్ హిసాఅ)

ఈ యుద్దాన్ని బదర్ యుద్ధంతో పోల్చడం జరుగుతుంది. ఒక రచయిత ఇలా వ్రాసాడు: ఆ సమయంలో హజ్రత్ అబూబకర్ రజి ప్రదర్శించిన విశ్వాసం, నమ్మకంను, పట్టుదల, స్థిరత్వం, దూరదృష్టి, ముందు జాగ్రతలను చూసి ముసల్మానుల మనస్సులో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో జరిగిన యుద్ధాలు గుర్తుకువచ్చాయి.

అబూబకర్ రజి కాలంలో జరిగిన ఈ యుద్ధం చాలా వరకు బదర్ యుద్ధంను పోలియున్నది. బదర్ యుద్ధంలో ముసల్మానుల సంఖ్య 313 మంది. చాలా తక్కువ సంఖ్య. మక్కా అవిశ్వాసుల సంఖ్యను చూసుకున్నచో 1000కిపైగా ఉండెను. హజ్రత్ అబూబకర్ రజితో వ్యతిరేకులు యుద్ధం చేసినప్పుడు కూడ ముసల్మానుల సంఖ్య చాలా తక్కువగా ఉండెను. అందుకు భిన్నముగా చూసినచో అబస్, జుబ్యాన్, మరియు ఘుత్ఫాన్ తెగలకు చెందిన వారు అధిక సంఖ్యలో ముసల్మానులపై దాఢి చేశారు. బదర్ యుద్ధంలో ముసల్మానులకు అల్లాహ్ తాలా అన్యారాధులపై విజయాన్ని ప్రసాదించాడు. ఈ సందర్భములో అబూబకర్ రజి మరియు వారి రజి మిత్రులు సంపూర్ణ విశ్వాసంను ప్రదర్శించడం వలన శత్రువులపై విజయాన్ని సాధించారు. ఏ విధముగానైతే బదర్ యుద్ధం రాబోవు రోజులకు మంచి ఫలితాన్ని చేకూర్చినదో అదే విధముగా ఈ యుద్ధంలో కూడ ముసల్మానులకు విజయం లభించడం వలన ఇస్లాం యక్క భవిష్యత్తుపై చాలా గొప్ప ప్రభావాన్ని చూపింది.

(హజ్రత్ అబూబకర్ రజి సిద్దీఖ్ ముహమ్మద్ హుస్సైన్ హైకల్ ఉర్దూ అనువాదం షేక్ ముహమ్మద్ అహ్మద్ పానిపత్ గారు పుట 150-151, ప్రచురణ ఇస్లామీయ కుతుబ్ ఖాన లాహౌర్)

బనూ జుబ్యాన్ మరియు బనూ అబస్ లు ఈ ఓటమి వలన చాలా ఆగ్రహా ఆవేశాలకు గురైనారు. ఫలితముగా వారి చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి ముసల్మానులపై ఒక్కసారిగా దాఢి చేసి వారిని చాలా ఘోరముగా రకరకాల శిక్షలకు గురి చేస్తూ అమరులను చేశారు. వారు వారి ఆధీనంలో ఉన్నటు వంటి ముసల్మానులపై ఈ విధమైన ప్రతీకారాన్ని తీర్చుకున్నారు. వారిని హత్య చేశారు, అమరులను చేశారు. వారిని అనుసరిస్తూ ఇతర తెగల వారు కూడ ఆ విధముగానే ముసల్మానులను శిక్షించసాగారు. వారి దాష్టికాలను గూర్చి తెలియగానే హజ్రత్ అబూబకర్ రజి వారు రజి అన్యారాధులకు సరైన గుణపాఠం నేర్పుతానని, ముసల్మానులను హత్య చేసిన తెగల వారిపై అందుకు తగిన ప్రతీకారం తీర్చుకుంటాను అని ప్రమాణం చేశారు.

(తారీఖే తిబ్రీ, సంపుటి 2, పుట 256, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

హజ్రత్ అబూబకర్ రజి నాయకత్వం, మార్గదర్శకంలో జకాత్‌ను తిరస్కరించు వారిని శిక్షించిన తరువాత ఇతర బలహీన తెగలవారు, చంచల తత్వం గల తెగల వారు ఒకరి తరువాత మరొకరుగా జకాత్‌ను తీసుకొని మదీనాకు చేరుకోవడం ప్రారంభించారు. బలమైన తెగల పరిస్థితియే ధయనీయంగా ఉన్నదని గ్రహించిన బలహీన మరియు జకాత్‌ను తిరస్కరించిన తెగలవారు జకాత్‌ను తీసుకొని మదీనాకు రావడం మొదలు పెట్టారు. కొన్ని తెగల వారు రాత్రివేళ జకాత్ తీసుకరాగా, మరి కొన్ని తెగల వారు అర్ధ రాత్రి జకాత్‌ను తీసుకవచ్చేవారు. మరి కొన్ని తెగలవారు తెల్లవారు సమయంలో జకాత్‌ను తీసుకవచ్చేవారు. వీరు మదీనాలో కనిపించడం

మొదలు పెట్టగానే వారి సమూహాలను చూసి మదీనా ప్రజలు వీరు భయపెట్టువారిని, ఏదో దుర్వార్తను తీసుకవచ్చారని భావించేవారు. కాని హజ్రత్ అబూబకర్ రజి అన్ని వేళల వీరు శుభవార్తను అందించు వారని, సహాయం చేయడం కోసం వచ్చారు, చేడు తలపెట్టడం కోసం కాదని ప్రకటన చేసేవారు. ఆ తరువాత వచ్చు తెగలవారు ముసల్మానులకు సహాయం చేయుటకు మరియు జకాత్ సంపదను తీసుకవచ్చాయని తెలియగానే హజ్రత్ అబూబకర్ రజి వారితో మీరు చాలా అదృష్టవంతులు, మీరు ఎల్లప్పుడు శుభవార్తను అందిస్తూనే వచ్చారు అని అనేవారు.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 256, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్ 2012)

ఈ సందర్భమున హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు. దుర్వార్తను, దుష్టస్వభావాలను కల్గిన వారు చాలా వేగంగా నడుస్తారు. అందుకు భిన్నముగా చూసినచో శుభవార్తను అందించు బృందాలు నెమ్మదిగా, ప్రశాంతంగా నడుస్తాయి. నేను వారి నడక వేగంను బటిట అంచనా వేస్తాను.

(అల్ మసీరతుల్ ఇస్లామీయ రచయిత మునీర్ ముహమ్మద్ ఘజ్బాన్, పుట 50, ప్రచురణ దారుల్ ఇస్లామ్ 2015)

జకాత్‌ను తిరస్కరించువారిపై విజయం లభించిన తరువాత జకాత్ వసూలును గూర్చి తారీఖే తిబ్రిలో ఈ విధముగా గలదు. ఆ కాలంలో ఎంతగా జకాత్ మరియు సద్కాత్‌లు మదీనాకు చేరుకున్నాయి అనగా ముసల్మానుల అవసరాలు పూర్తి అయ్యి సంపద మిగిలిపోసాగింది.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 257, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

ఈ విజయాలు, శుభవార్తల కాలంలో హజ్రత్ ఉసామా రజి సైన్యం కూడ విజయంతో, వీరదరహాసంతో మదీనాకు తిరిగి వచ్చింది. హజ్రత్ ఉసామా రజి తిరిగి రాగానే హజ్రత్ అబూబకర్ రజి వారిని మదీనాకు తమ ఉప ప్రతినిధిగా నియమించారు. మరొక కథనములో హజ్రత్ అబూబకర్ రజి సిన్నాన్ జమ్రీని తమ ఉపప్రతినిధిగా నియమించినట్లు గలదు. ఆపై వారితో వారి సైన్యంతో ముందుగా మీరు విశ్రాంతి తీసుకోండి, మీ సవారి జంతువులకు కూడ విశ్రాంతిని కల్పించండి అని తెలియజేసి స్వయముగా హజ్రత్ అబూబకర్ రజి తమ సైన్యాన్ని తీసుకొని జుల్ ఖుస్సా ప్రాంతానికి ప్రయాణమైనారు. కాని ముసల్మానులు హజ్రత్ అబూబకర్ రజితో ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా! దేవుని కొరకు మీతో విన్నవించుకుంటున్నాము. మీరు స్వయముగా ఈ యుద్ధంలో పాల్గొనకండి. ఎందుకనగా పొరపాటున మీకు ఏదైన జరిగినచో వ్యవస్థ మొత్తం చిన్నాభిన్నమైపోతుంది. కావున మీరు మరొకరిని ఈ యుద్ధం కొరకు పంపించండి. ఒకవేళ వారికి ఏదైన జరిగినా కూడ మీరు వెంటనే మరొకరిని వారి స్థానంలో నియమించవచ్చును. అందుకు హజ్రత్ అబూబకర్ రజి అల్లాహ్ ప్రమాణం! నేను ఎన్నడు అలా చేయను. మీ బాధలను నేను నా ప్రాణాలతో తీరుస్తాను అని అన్నారు.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 253-256, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్ 2012)(సయ్యదినా అబూబకర్ సిద్దీఖ్ రజి వ్యక్తిత్వం, వ్యవహార శైలీ, సేలాబీ అనువాదం. పుట 282, మక్తబల్ ఫుర్ఖాన్ ముజఫర్ ఘడ్ పాకిస్తాన్)

మరల రబజ తెగలవారిపై దాడిని గూర్చి ఈ విధముగా పేర్కొన్నారు. హజ్రత్ అబూబకర్ రజి అన్ని రకాల ఏర్పాట్లు చేసి జూ హిస్సా మరియు జుల్ ఖస్సా ప్రాంతాల వైపు బయలు దేరినారు. జుల్ ఖుస్సా మదీనా నుండి 40 మైళ్ళ దూరంలో ఉన్నది. నుఅమాన్ రజి, అబ్దుల్లాహ్ రజి, సువైద్ రజిలు తమ తమ నిర్ధేశిత చోటులలోనే ఉన్నారు. ఈ క్రమంలోనే హజ్రత్ అబూబకర్ రజి అబ్‌రఖ్ ప్రాంతంలో రబజ తెగవారిని చుట్టు ముట్టారు. భీకరమైన యుద్ధం జరిగింది. చివరికి అల్లాహ్ తాలా హారిస్ మరియు ఔఫ్ లకు ఓటమిని ప్రసాదించాడు. వీరు ముర్ర, సఅలబ, అబస్ తెగలకు నాయకులు. హుతైబ ప్రాణాలతో పట్టుబడ్డాడు. హజ్రత్ అబూబకర్ రజికొన్ని రోజులు అబ్‌రఖ్‌లోనే ఉన్నారు. ఆ సమయంలో వారు రజి అబ్‌రఖ్ ప్రాంతాన్ని ముసల్మానుల గుర్రాలకు కంచేగా ప్రకటించారు. ఈ యుద్ధంలో ఓడిపోయినా బనూ అబస్ మరియు బనూ జుబ్యాన్ తెగలవారు సమీరా నుండి నడిచి వస్తూ బుజాఖా ప్రాంతానికి చేరుకొని బస చేసిన తులైహా వారితో కలిసిపోయారు. బుజాఖా కూడ బనూ అసద్ యొక్క చెలిమ పేరు. ఇక్కడ కూడ హజ్రత్ అబూబకర్ రజి కాలంలో తులైహా అసదీతో భీరకమైన యుద్ధం జరిగింది.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 256, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)(ప్రాంగ్ సీరత్ పుట 236, జవార్ అకాడమీ పబ్లికేషన్స్ కరాచి 2003)(ముఅజముల్ బల్దాన్ సంపుటి 1, పుట 484-485, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్)

ఓటమిపాలైన తెగలను గూర్చి మరొక రచయిత ఈ విధముగా వ్రాసాడు: అబస్, జుబ్యాన్, ఘుత్ఫాన్, బనీ బకర్ మరీయు మదీనాకు సమీపంలో నివాసం ఉండే ఇతర ద్రోహిత తెగలవారు తమ పట్టుదలను వీడి, విద్రోహచర్యలనుండి దూరంగా ఉన్నచో బాగుండేది. హజ్రత్ అబూబకర్ రజి పట్ల సంపూర్ణ విధేయతను ప్రదర్శిస్తూ , ఇస్లాం మూలసిద్ధాంతాలను ఆచరిస్తామని అంగీకరిస్తూ ముసల్మానులతో కలసి ధర్మ భ్రష్టులకు భిన్నముగా పోరాడినచో బాగుండేది. సమయస్ఫూర్తి కూడ ఇదే. ఘటనలు కూడ దీనినే బలపర్చుతున్నాయి. అబూబకర్ రజి ద్వారా వారి బలం ముక్కలు చెక్కలైనది. రోమన్ సరిహద్దులలో కూడ విజయం లభించడంతో మదీనా ప్రజల ప్రభావం రెట్టింపు అయినది. ముసల్మానుల శక్తి, సామార్థ్యములు కూడ పెరిగిపోయాయి. ఇప్పుడు ముసల్మానులు బదర్ మరియు ప్రారంభ యుద్ధ సమయంలో ఉన్నట్లుగా బలహీన స్థితిలో లేకుండెను. నేడు మక్కా వారు కూడ ముసల్మానులకు తోడుగా ఉన్నారు, తాయిఫ్ వారుకూడ తోడుగా నిలిచారు. ఈ రెండు నగరాల సార్వభౌమాధికారం అరబ్ మొత్తంపై కొనసాగుచున్నది. అంతేగాకా ఆయా తెగలలో ముసల్మానులు కూడ అధికముగానే ఉన్నారు. కావున వారిని ద్రోహులు తమలోకలుపుకునే అవకాశం కూడ లేకుండెను. ఈ కారణాల చేత ద్రోహుల స్థితి చాలా ధయనీయముగా మారిపోయింది. అయినా కూడ ముసల్మానులతో వారికి ఉన్న శత్రుత్వం వారిని ఇంకా అంధులను చేసింది. ఆలోచన, అవగాహనల తత్వం వారి మనస్సులో నుండి కనుమరుగైనది. వారు తమ ప్రాంతాలను వీడారు. ఆపై బనూ అసద్ తెగకు చెందిన అసత్య ప్రవక్తుత్వ ప్రకట చేసిన తులైహా బిన్ ఖువైలద్‌తో చేతులు కలిపారు. వారి మధ్యలో ఉన్నటు వంటి ముసల్మానులను ఆ దుష్టులు తమ ఆగ్రహావేశాలతో శిక్షించారు. ఆయా తెగల వారు చేరుకోవడంతో తులైహా మరియు ముసల్మా కజ్జాబ్‌ల బలబలాలు రెట్టింపు అయినాయి. ఫలితముగా యమన్‌లో విద్రోహపు అగ్ని జ్వాలలు ఉవ్వేత్తున ఎగిసి పడ్డాయి.

(హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి ఫైసలే, అబ్దుల్లాహ్ మద్‌ని పుట 173-174, ముష్తాఖ్ బుక్ కార్నర్ లాహెూర్)

మొత్తానికి ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, వారే ద్రోహానికి పాల్పడ్డారు, యుద్ధం కూడ చేశారు. కేవలం ఏదో ప్రకటన లేదా ఒకరి ప్రకటన వలన ఈ యుద్ధం జరుగలేదు. కేవలం విద్రోహులను శిక్షించడానికి, వారి విద్రోహ చర్యలకు సమాధానం చెప్పడానికి మాత్రమే యుద్ధం చేశారు.

జకాత్‌ను తిరస్కరించువారిపై విజయం సాధించడం మరియు హజ్రత్ అబూబకర్ రజి గారి ధైర్యం, వీరత్వంను గూర్చి తెల్పుచూ అబ్దుల్లాహ్ బిన్ మసూవూద్ రజి ఇలా తెలిపారు: వారి కథనము ఇలా ఉన్నది రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన తరువాత అల్లాహ్ తాలా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి ద్వారా మాకు సహాయం అందించకపోయినచో ఖచ్చితముగా మేము నాశనమయ్యే స్థాయిలో ఉండేవారము. మేము జకాత్ ఒంటెల కోసం ఇతరులతో యుద్ధం చేయకూడదని, కేవలం అల్లాహ్ తాలాను ఆరాధించడంలోనే నిమగ్నమైపోతామని, ఆ విధముగానే మేము పూర్తి స్థాయిలో విజయాన్ని సాధిస్తామని ముసల్మానులందరం ముక్త కంఠంతో ఏకాభిప్రాయానికి వచ్చాము. కాని అబూబకర్ సిద్దీఖ్ రజి జకాత్ తిరస్కరించువారితో యుద్ధం చేయాలని పట్టుబట్టినారు. వారు రజి తిరస్కరించువారి ముందు కేవలం రెండే విషయాలను ప్రస్తావించారు. మూడవ ప్రస్తావన చేయలేదు. మొదటిది వారు తమకోసం అవమానంను స్వీకరించండి. ఇది అంగీకారం కానిచో ఈ ప్రాంతాన్ని వదిలి వేళ్ళండి లేదా యుద్ధానికి సిద్ధంకండి. తమ కోసం అవమానంను స్వీకరించడం అనగా వారి మృతులు నరకవాసులు, ముస్లింల మృతులు స్వర్గవాసులని, వారు ముసల్మానుల మృతులకు పరిహారం చెల్లించుటను అంగీకరించుట. మేము వారి నుండి వసూలు చేసినయుద్ధ సంపదను తిరిగి అడుగకూడదు. కాని ముసల్మానుల నుండి వారు దోచుకున్న సంపదను తిరిగి ముసల్మానులకు అప్పగించాలి. బహిష్కరించు శిక్ష అనగా ఓటమిపాలు కాగానే తమ ప్రాంతాలను వీడివెళ్ళిపోవాలి. సుదూర ప్రాంతాలకు వెళ్ళి జీవనంను కొనసాగించాలి.

(హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి, ముహమ్మద్ హుస్సేన్ హైకల్ అనువాదం, పుట 118, షిర్కత్ ప్రిటింగ్ ప్రెస్ లాహెూర్)

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఈ విషయాన్ని ఇలా తెలిపారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతిచెందిన తరువాత అరబ్‌కు చెందిన కొన్ని తెగలు జకాత్ చెల్లించుటకు తిరస్కరించారు. అందుకు

హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ అన్‌హు వారితో యుద్ధం చేయుటకు సిద్ధమైనారు. ఆ సమయంలో పరిస్థితులు ఎంత సున్నితముగా ఉన్నాయగా హజ్రత్ ఉమర్ రజి వంటి గొప్ప గొప్ప అనుచరులే వారితో సున్నితముగా వ్యవహరించమని సలహా ఇచ్చారు. కాని హజ్రత్ అబూబకర్ రజి ఇలా సమాధానం ఇచ్చారు: " ఈ కథనాన్ని ఇంతకు ముందు కూడ ప్రస్తావించడం జరిగింది. "అబూ ఖుహాఫా కుమారుడికి ఇంత సాహసమా?. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జారి చేసిన ఆదేశాన్ని రద్దు చేయగలడా?. అల్లాహ్ ప్రమాణం! ఒకవేళ వీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఒంటెల కాళ్ళను కట్టే త్రాడును జకాత్‌గా చెల్లించేవారైనచో నేను ఆ త్రాడు కోసం కూడ వీరి తో యుద్ధం చేస్తాను. వారు జకాత్ చెల్లించనంత వరకు నేను ఖాళీగా ఉండను. " వారు రజి మరల తమ మిత్రులతో ఇలా అన్నారు: " ఒకవేళ మీరు ఈ విషయంలో నాకు సహకరించకున్నను పర్వాలేదు. నేను ఒక్కడినే వారితో పోరాడుతాను" హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా అన్నారు: " ఈ స్థాయిలో ప్రవక్తను అనుసరించాలి. చాలా భయంకరమైన పరిస్థితులు ఏర్పడినా కూడ, ప్రముఖ అనుచరులు యుద్ధం చేయడం మంచికాదని సలహా ఇచ్చినా కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాన్ని పూర్తి చేయడం కోసం అన్ని రకాల సమస్యలను భరించుటకు సిద్ధమైయ్యారు. "

(తఫ్సీరే కబీర్, సంపుటి 8, పుట 108-109)

మరల హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి మరొక సందర్భములో ఈవిధముగా తెలిపారు: " హజ్రత్ అబూబకర్ రజి కాలంలో భ్రష్టత్వం విస్తరించసాగింది. కేవలం గ్రామాలలోనే సామూహికముగా నమాజ్‌లను సల్పేవారు. సైన్యాన్ని కూడ సిరియా వైపు పంపించారు. అయినా కూడ వారు రజి జకాత్ చెల్లించేవారికి ఒకవేళ మీలో ఎవరైనా కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఒక చిన్నపాటి త్రాడును జకాత్‌గా చెల్లించి, నేడు చెల్లించనిచో నేను ఖడ్గపు బలంతో దానిని తప్పకుండా వసూలు చేస్తాను అని నోటీసులు పంపించారు. హజ్రత్ ఉమర్ రజి వంటి వీరత్వం, ధీరత్వం గల అనుచరులు కూడ ఈ సమయం జకాత్‌కోసం పట్టుపడవలసిన సమయం కాదని సలహా ఇచ్చారు. అయినా కూడ వారురజి ఎవరి మాటను పట్టించుకోలేదు. దీని ద్వారా కూడ జకాత్‌కు ఎంత ప్రాధాన్యత ఉన్నదో అర్థమవుతుంది. "

(మదారిజే తఖ్వా, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 1, పుట 382-383)

ఈ విషయాన్ని హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి తమ ఉపన్యాసంలో ప్రస్తావించారు. అందులో నిష్టాపరత స్థాయిలను గూర్చి కూడ తెలిపారు. ఆ ఉపన్యాసంలో నిష్టాపరతకు ఎన్ని స్థాయిలు ఉంటాయి. జకాత్‌కు ఎంతటి ప్రాధాన్యత ఉంటుంది. నిష్టాపరతను అనుసరించువారికి తప్పనిసరి పాటించు అంశాలు ఏమిటి?. అచట వారు రజి ఈ విషయాన్ని కూడ ప్రస్తావించారు. అహ్మదీయులు కూడ జకాత్ ప్రాధాన్యతను తెలుసుకోవాలి. క్రమం తప్పకుండా జకాత్ చెల్లించుటకు ప్రయత్నించాలి.

(మదారిజేతఖ్వా, అన్వారుల్‌ఉలూమ్, సంపుటి 1, పుట 383).

మరొక చోట జకాత్ అంశంను గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: "మరొక ముఖ్యమైన అంశం జకాత్. కాని ప్రజలు ఈ అంశాన్ని అర్థం చేసుకోవడం లేదు. అల్లాహ్ తాలా నమాజ్ తరువాత జకాత్‌ను గూర్చి ఆదేశించాడు. హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవిశ్వాసులతో వ్యవహరించినట్లుగానే నేను జకాత్ చెల్లించని వారితో వ్యవహరిస్తాను. అలాంటి వారిలో పురుషులు బానిసలుగా, వారి మహిళలు బానిసరాళ్ళుగా మారుతారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన తరువాత ఎంత పెద్ద విపత్తు ఎదురైనదనగా, మొత్తం అరబ్‌లో కేవలం మక్కా , మదీనాలతో పాటు మరొక నగరం కాకుండా అరబ్‌కు చెందిన మిగిలిన ప్రాంతాల ప్రజలందరు భ్రష్టత్వాన్ని స్వీకరించారు. .... హజ్రత్ ఉమర్ రజి ఇలా విన్నవించు కున్నారు. జకాత్‌ను తిరిస్కరించువారితో సంధి చేసుకోవడం మంచిది. ముందుగా ఇతర భ్రష్టులతో యుద్ధం చేద్దాం ఆ తరువాత నెమ్మది నెమ్మదిగా వీరిని కూడ సంస్కరించుదాం. అన్నిటికన్న ముందు అసత్య ప్రవక్తుత్వ ప్రకటన చేసినవారిని హతమార్చుదాము, ఎందుకనగా వారు చాలా పెద్ద విపత్తును సృష్టిస్తున్నారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఇలా అన్నారు. ఒకవేళ ఈ ప్రజలు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో మేక పిల్ల లేదా ఒంటె పిల్ల కాళ్ళను కట్టివేసే త్రాడుకు సమానంగా జకాత్‌ను చెల్లించేవార్రై, నేడు చెల్లించుటకు తిరస్కరించినచో నేను తప్పకుండా వారితో యుద్ధం చేస్తాను. ఒకవేళ మీరు నన్ను వదిలి వెళ్ళిపోయినా సరే. అడివి మృగాలు కూడ జకాత్ తిరస్కరులతో కలసి దాడులు చేసిన కూడ నేను ఒంటరిగానే ఎదుర్కొంటాను. "

(బర్కాతే ఖిలాఫత్ , అన్వారుల్ ఉలూమ్, సంపుటి 2, పుట 222-223)

ధర్మశాస్త్రాన్ని అమలు పర్చడం కోసం ప్రయత్నించడం కూడ ఖిలాఫత్ శుభప్రదమే అనబడుతుంది. వర్తమాన ఖలీఫా పూర్తి స్థాయిలో ప్రయత్నిస్తాడు.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి మరొక చోట ఈ విధముగా తెలిపారు: ప్రజలు మరొక ఆరోపణ చేస్తుంటారు. కాని అల్లాహ్ తాలా 1300ల సంవత్సరాలకు పూర్వమే అందుకు సమాధానంను ఇచ్చాడు. ఆరోపణలు చేయువారు షావిరుహుం ఫిల్ అమ్‌రి ఇది ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు అందిన ఆదేశం. ఇక్కడ ఖిలాఫత్ ప్రస్తావన ఎక్కడున్నది?, ఖిలాఫత్ కోసం ఈ ఆదేశం లేదు కదా? అని అంటారు. కాని ఆరోపకులు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా హజ్రత్ అబూబకర్ రజిపై జకాత్ విషయంలో ఆరోపణలు చేసినప్పుడు ఆ ఆరోపణ కూడ ఈ రకంగానే ఉండెను. అనగా ఖుజ్ మిన్ అమ్‌వాలిహిం సదఖతన్ ఇది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అందిన ఆదేశమే. కాని ఈ ఆదేశం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అందినది. కాని వారు (స) ఇప్పుడు లేరు. కావున సద్కాత్ వసూలు చేయు అధికారం ఎవరికి ఉండదు. ఎవరైతే తీసుకొమ్మన్ని ఆదేశించ బడ్డారో వారు మృతిచెందారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఈ విధముగా సమాధానం ఇచ్చారు. ఇప్పుడు ఆ ఆదేశానికి నేను అర్హుడను. అనగా హజ్రత్ అబూబకర్ రజి ఉద్దేశించబడుతారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందారు, కాని ధర్మశాస్త్రము స్థిరముగానే ఉన్నది. అందుకే ఇప్పుడు ఖలీఫాకు ఆ ఆదేశం వర్తిస్తుంది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఈ ఉపన్యాసం చేస్తున్నారు. ఆ క్రమంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఆ విధముగానే భావించుకుంటూ నేను నా ప్రత్యర్థికి సమాధానం ఇస్తున్నాను. నేటి కాలంలో ఆ ఆదేశం నాకు వర్తిస్తుంది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: ఒకవేళ ఆ కాలంలో ఈ సమాధానం సరైనదే అయినచో తప్పకుండా సరైనదై ఉంటుంది. దీనిని హజ్రత్ అబూబకర్ రజి సమాధానంగా ఇచ్చారు. కావున నేను ఇచ్చు సమాధానం కూడ సరైనదై ఉంటుంది. నేటి కాలంలో నాకు వర్తిస్తుంది. ఈ సూత్రమే ఎల్లప్పుడు ఖిలాఫత్‌కు వర్తిస్తుంది. ఇది గుర్తుంచుకోవలసిన విషయం. మరల వారు ఇలా తెలిపారు: ఒకవేళ మీరు చేయు ఆరోపణలు సత్యమైనవే అయినచో వాటి ఫలితముగా పవిత్ర ఖుర్‌ఆన్‌లోని అనేక ఆదేశాలను తొలిగించవలసి ఉంటుంది. ఇది స్పష్టమైన మూర్ఖత్వం అనబడుతుంది.

(మన్సబే ఖిలాఫత్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 2, పుట 59-60)

ఈ విషయాలన్నింటిని వారు రజి మన్సబే ఖిలాఫత్ అనే అంశంపై ప్రసంగించు తున్నప్పుడు ప్రస్తావించారు.

మరొక సందర్భములో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: " వారు (స)" అనగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం " మృతి చెందిన సమయంలో అనేక మంది మూర్ఖపు ముసల్మానులు ఇస్లాంను వదిలి వేశారు. కేవలం మూడు ప్రాంతాలలోని మస్జిద్‌లలో సామూహికముగా నమాజ్‌లు సల్పేవారని చరిత్రలోపేర్కొనడం జరిగింది. అంతేగాకా దేశంలోని అనేక మంది జకాత్‌ను చెల్లించుటకు నిరాకరించారు. పైగా వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన మా నుండి జకాత్‌ను వసూలు చేయు అధికారం ఇతరులకు ఎందుకు ఉంటుంది? అని వాదించేవారు. అరబ్ మొత్తం ఈ వాదనలు వ్యాపించగా హజ్రత్ అబూబకర్ రజి అలాంటి వారిపట్ల కఠినముగా వ్యవహరించాలని చూశారు. ఆ సమయంలక్ష హజ్రత్ ఉమర్ రజి మరియు మరికొందరు ప్రముఖ అనుచరులు హజ్రత్ అబూబకర్ రజి వద్దకు వచ్చి " నేను ఇంతకు ముందు తెల్పినట్లుగా " వారు ఇలా విన్నవించుకున్నారు. ఇప్పుడున్న పరిస్థితులు చాలా సున్నితముగా ఉన్నాయి. ఇప్పుడు మనం వేసే చిన్నపాటి తప్పటడుగు కూడ చాలా పెద్ద నష్టాన్ని కల్గించ వచ్చును. కావున మా అభిప్రాయమేమనగా, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్నశత్రువులతో యుద్ధం చేయకపోవడం మంచిది. పైగా జకాత్ చెల్లించని వారితో కఠినముగా వ్యవహరించకండి అని అన్నారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఇలా సమాధానం ఇచ్చారు. మీలో భయపడువారు తమకు నచ్చిన చోటుకు వెళ్ళవచ్చును. దేవుని ప్రమాణం! ఒకవేళ మీలో ఏ ఒక్కరు కూడ నాకు సహకరించకున్నను నేను ఒక్కడినే శత్రువులతో పోరాడుతాను. ఒకవేళ శత్రువులు మదీనాలోకి ప్రవేశించినా, నా బంధువు మిత్రులను, సన్నిహితులను హత్యచేసినా, మహిళల శవాలను మదీనా వీదులలో లాక్కేల్లుచున్నా నేను మాత్రం వారితో పోరాడుతాను. అలా వారు గతంలో జకాత్ చెల్లించునట్లుగా చెల్లించనంత వరకు నేను వారితో పోరాడుతూనే ఉంటాను. మొత్తానికి వారు " అనగా హజ్రత్ అబూబకర్ రజి " దుష్ట శత్రువులతో ఎంతో

ధైర్యముగా పోరాడారు. చివరికి వారిపై విజయాన్ని సాధిచారు. కేవలం ఎందుకనగా ఈ పనిని నేనే చేయాలని వారు భావించారు కావున. అందుకే వారు రజి సలహా ఇచ్చు అనుచరులతో మీరు నాకు సహకరించిన సహకరించక పోయినా నేను ఒంటరిగానే శత్రువులతో పోరాడుతాను, చివరికి నా ప్రాణాలు దైవ మార్గంలో పోయినా పర్వాలేదు అని అన్నారు. కావున ఏ సమాజంలో ఈ పట్టుదల ఉంటుందో " హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: "ఏ సమాజంలో ఈ పట్టుదల ఉంటుందో ఆ సమాజం అన్ని రంగాలలో విజయం సాధిస్తుంది. శత్రువులు ఎన్నడు అట్టి సమాజం ముందు నిలబడలేరు. "

(ఖౌమి తరక్కి కోసం రెండు సూత్రాలు, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 19, పుట 75-76).

ఇదే సమాజ అభ్యున్నతి రహస్యం. దీనిని ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి.

మరొక సందర్భములో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: " రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత జకాత్ విషయంలో తలెత్తిన విభేదాల వలన అరబ్‌కు చెందిన వేలాది మంది ప్రజలు ధర్మభ్రష్టులైనారు. ముసైల్మా మదీనాపై దాడి చేశాడు. ఆ సమయంలో ఖలీఫాగా ఉన్నటు వంటి హజ్రత్ అబూబకర్ రజికు ఒక లక్ష మంది సైన్యంతో దాడికి వస్తున్నట్లుగా సమాచారం అందినది. ఆ సమయంలో కొంత మంది హజ్రత్ అబూబకర్ రజికు పరిస్థితులు సమస్యాత్మకముగా ఉన్నాయి కావున జకాత్ విషయంలో ఏర్పడిన విభేదాల వలన అనేక మంది ప్రజలు ధర్మభ్రష్టులవుచున్నారు. మరోవైపు ముసైల్మా ఒక పెద్ద సైన్యాన్ని తీసుకొని దాడి చేయుటకు వస్తున్నాడు. ఇలాంటి పరిస్థితులలో మీరు జకాత్‌ను అడగకపోవడమే గాకా వారితో ఒప్పందం కుదుర్చుకోవడం ఉత్తమం అనిపిస్తుంది అని సలహా ఇచ్చారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఆ భయానక స్థితిగతులను గూర్చి ఏ మాత్రం భయపడకుండా సలహా ఇచ్చేవారితో ఇలా అన్నారు. అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాలకు భిన్నముగా నడుచుకొమ్మని మీరు నాకు సలహాలు ఇస్తున్నారా?. జకాత్ ఆదేశం అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వైపు నుండి జారి చేయబడిన ఆదేశం. కావున నేను అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాలను ఆచరింప జేయుటకు సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాను. అనుచరులు రజి మరల కనీసం పరిస్థితుల దృష్ట్యా అయినా మీరు సంధి చేసుకోండి అని సలహా ఇచ్చారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఒకవేళ మీరు యుద్ధం చేయలేకపోయినచో, శత్రువులను ఎదురించే సామర్థ్యం మీకు లేనిచో మీరు వెళ్ళిపోండి. మీ ఇళ్ళకు వెళ్ళి కూర్చొండి. దేవుని ప్రమాణం! ఒంటెల కాళ్ళను కట్టివేసే త్రాడును గతంలో జకాత్‌గా చెల్లించువారు నేడు జకాత్‌గా వాటిని చెల్లించనంత వరకు నేను ఒంటరిగానే శత్రువులతో పోరాడుతాను. అదే విధముగా వారిని జకాత్ చెల్లించువారిగా మార్చుతాను గాని, వారితో నేను ఎలాంటి సంధిని చేసుకోను అని అన్నారు. " హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి మరల ఇలా తెలిపారు: "స్వచ్ఛమైన విశ్వాసానికి ఇదే నిదర్శనం. "

(హమారే జిమ్మా తమామ్ దునియాс కో ఫతహ్ కర్నేకా కామ్ హై, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 18, పుట 458)

ఇదే నిజమైన విశ్వాసం. ఒకవేళ ఈ విశ్వాసం మనలో ఉన్నప్పుడే మనం ప్రపంచంలో ఇస్లాం యొక్క నిజమైన సందేశాన్ని వ్యాపింపజేయగలము. ఇన్షా అల్లాహ్ విజయం సాధించగలము.

మరొక చోట హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: " హుజూర్ (స) మృతి చెందిన తరువాత అరబ్‌కు చెందిన అనేక తెగలు తిరుగుబాటు చేయసాగాయి. పైగా వారు జకాత్ చెల్లించడాన్ని తిరస్కరించారు. అందుకు వారు అల్లాహ్ తాలా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు కాకుండా మరెవ్వరికి కూడ జకాత్‌ను సేకరించే అధికారంను ఇవ్వలేదు అని వాదించసాగారు. ఈ క్రమంలోనే అల్లాహ్ ఇలా తెలిపాడు. " అనగా అల్లాహ్ తాలా ఆс హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశిస్తూ ఇలా ఆదేశించాడు. ."... ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నీవు వారి సంపదలో నుండి కొంత ధనమును జకాత్‌గా సేకరించుము. అంతేగాని మరెక్కడ కూడ మరొకరిని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత జకాత్ సేకరించుము అని ఆదేశించలేదు. కాని ముసల్మానులు వారి ఈ ఆధారాన్ని స్వీకరించలేదు. నిజానికి అక్కడ ప్రత్యేకించి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ను ఉద్దేశించే ఆదేశించడమైనది. మొత్తానికి ఆ సమయంలో ధర్మ భ్రష్టత్వంను ఎంచుకున్న వారి వద్ద ఉన్నటు వంటి ఒకే ఒక్క ఆధారం ఇదే. అనగా జకాత్ సేకరించు అధికారం కేవలం ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రమే ఉన్నది కాని మరెవరికి లేదు. ఇలా మోసపోవుటకు గలకారణం ఏమిటనగా, వ్యవస్థకు సంబంధించిన ఆదేశాలన్ని శాశ్వతమైనవి కావు. కేవలం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వరకే ప్రత్యేకించబడ్డాయి అని భావించడం. " మరల వారు రజి ఇలా తెలిపారు:"..... ఇది పూర్తిగా తప్పుడు ఆలోచన. వాస్తవాన్ని మనం చూసినచో ఏ విధముగానైతే నమాజ్ మరియు ఉపవాసాల ఆదేశాలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తో ముగిసిపోలేదో అదే విధముగా సమాజ మరియు దేశ వ్యవస్థలను పటిష్టం చేయు ఆదేశాలు కూడ హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతితో ముగిసిపోలేదు. సామూహిక ఆరాధన అయినా సామూహిక నమాజ్ ఆదేశం వలే ఈ ఆదేశాల విషయంలో కూడ ఎల్లప్పుడు ముసల్మానులలో హుజూర్ (స) ప్రతినిధి ద్వారా ఆయా ఆదేశాలు ఆచరించబడాలి. "

(ఖిలాఫతే రాషిదా, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 15, పుట 30-31)

మరొక సందర్భములో హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఈ విధముగా తెలిపారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన తరువాత హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ అన్హు ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు. ఆ సమయంలో అరబ్‌కు చెందిన అనేకులు ఇస్లాంను వీడడం ప్రారంభించారు. కేవలం మక్కా మరియు మదీనాలతో పాటు మరొక చిన్నపాటి ప్రాంతంలో కాకుండా మిగిలిన వారందరు జకాత్ చెల్లించుటకు నిరాకరించారు. ఆపై ఇలా వాదించసాగారు. అల్లాహ్ తాలా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఖుజ్ మిన్ అమ్‌వాలిహిం సదఖతన్ అనగా వారి సంపదలో నుండి సద్కాను సేకరించుము అని ఆదేశించాడు. కావున మరేవరికి కూడ మా నుండి జకాత్ సేకరించే అధికారం లేదు. మొత్తానికి అరబ్‌లు ఇస్లాంను వీడసాగారు. ఆపై యుద్ధం చేయడానికి సిద్ధమైనారు. కేవలం ఇస్లాంను వీడడమే గాకుండా యుద్ధం కోసం కూడ బయలు దేరారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఇస్లాం బలహీనముగా ఉన్నప్పటికి అరబ్ తెగలవారు విడి విడిగా దాడులు చేసేవారు. ఒకసారి ఒక తెగవారు యుద్ధం చేయడానికి వస్తే మరొసారి మరో తెగవారు వచ్చేవారు. అహ్‌జాబ్ యుద్ధంలో అవిశ్వాసులందరు కలిసికట్టుగా ముసల్మానులపై దాడులు చేయడానికి వచ్చిన సమయం వరకు ఇస్లాం చాలా శక్తిని కూడగట్టుకున్నది. అంతమాత్రమున వారికి రాబోవు దాడులను గూర్చి భయమే లేకుండపోయిందని కాదు. ఆ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాను జయించుటకు బయలు దేరినారు. ఆ సమయంలో అరబ్‌కు చెందిన కొన్ని తెగల వారు హుజూర్ (స) కు సహాయం అందించుటకు ముందుకు వచ్చాయి. ఆ విధముగా అల్లాహ్ తాలా నెమ్మది నెమ్మదిగా శత్రువులలో ఉద్వేగాన్ని పెంచాడు. తద్వారా దేశమంతట ఒకేసారి శక్తిని కూడ గట్టుకోకుండా ఉండిపోయింది. కాని హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్హు కాలంలో అరబ్‌లందరు ఒక్కసారిగా ఇస్లాంను వీడారు. కేవలం మక్కా , మదీనా, మరొక చిన్న పాటి ప్రాంతమే మిగిలి యున్నది. మిగిలిన ప్రాంతాల ప్రజలందరు జకాత్‌ను చెల్లించుటకు నిరాకరించారు. పైగా సైన్యాన్ని తీసుకొని యుద్ధానికి బయలుదేరారు. కేవలం జకాత్ చెల్లించుటకు నిరాకరించడమే గాకుండా సైన్యాన్ని తీసుకొని పోరాటం చేయుటకు బయలు దేరినారు. కొన్నిచోట్ల వారి వద్ద లక్షకుపైగా సైన్యం ఉన్నది. కాని ముసల్మానుల వద్ద కేవలం 10వేల మంది సైనికులు మాత్రమే ఉన్నారు. వారిలో కొందరు సిరియా వైపు వెళ్ళుచున్నారు. ఈ సైన్యాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ మరణానికి కొన్ని రోజుల ముందే రోమన్‌లతో యుద్ధం చేయుటకు సిద్ధం చేశారు. ఆ సైన్యానికి ఉసామాను సేనాధిపతిగా నియమించారు. మిగిలిన వారిలో బలహీనులు, వృద్ధులు, లెక్కించుటకు కొంత మంది నవయువకులు ఉన్నారు. ఈ పరిస్థితులను చూసి కొందరు అనుచరులు ఇలా ఆలోచించారు. ఇలాంటి తిరుగుబాటు సమయంలో ఒకవేళ ఉసామా సైన్యం యుద్ధానికి వెళ్ళినచో మదీనా వారిని ఎవరు కాపాడుతారు?. అందుకని కొందరు ప్రముఖ అనుచరుల బృందం హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ అన్హు సన్నిధికి చేరుకున్నారు. ఇంతకు ముందు కూడ ఈ విషయాన్ని ప్రస్తావించాను. ఆపై ఇలా విన్నవించుకున్నారు. కొన్ని రోజుల వరకు ఈ సైన్యాన్ని ఆపుము. తిరుగుబాటు సద్దుమణిగిన తరువాత వారిని పంపండి. కాని ఈ పరిస్థితులలో ఆ సైన్యాన్ని పంపడం చాలా ప్రమాదకరం. ఈ మాటలు వినగానే హజ్రత్ అబూబకర్ రజి ఎంతో కోపంతో ఇలా అన్నారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన తరువాత ఏ సైన్యాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సాగనపంపుటకు సిద్ధం చేశారో ఆ సైన్యాన్ని అబూ ఖుహాఫా కుమారుడు మొదటి పనిగా ఆపాలని మీరు భావిస్తున్నారా?. మొత్తానికి వారు ఇలా అన్నారు. ఈ సైన్యం వెళ్ళుతున్నది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపాలని ఆదేశించిన

ఈ సైన్యాన్ని నేనే దగ్గరుండి పంపిస్తాను. ఒకవేళ మీరు శత్రువు సేనలను చూసి భయపడుచున్నచో మొహమాటం లేకుండా మీరు నన్ను వదిలి వెళ్ళిపోండి. నేను ఒంటిరిగానే శత్రువులందరితో పోరాడుతాను. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: యఅబుదూనని లా యుష్రికూన బి షైఅన్ కు అతి పెద్ద నిదర్శం ఇది. అనగా ఖిలాఫత్‌ను అధిష్టించేవారు లేదా ఖిలాఫత్‌కు తోడుగా ఉండేవారు విశ్వాసులు కేవలం నన్నే ఆరాధిస్తారు, నాకు మరెవరిని సాటిగా చేయరు. ఈ స్థితియే ఖిలాఫత్ వ్యవస్థతో పాటు ఉంటుంది. ఉండబోతుంది కూడ.

మరల వారు ఇలా తెలిపారు: రెండవ ప్రశ్న జకాత్‌కు చెందినది. ఒకవేళ మీరు సైన్యాన్ని ఆపలేక పోవుచున్నచో కనీసం వారితో తాత్కాలికముగా సంధి చేసుకోండి. ఈ సంవత్సరం మీ నుండి జకాత్ తీసుకోము అని వారితో చెప్పండి. ఈ మధ్య కాలంలో వారు కూడ కొంత మెత్తబడుతారు. విభేదాలు కూడ కనుమరుగు అయ్యే అవకాశాలు కూడ ఏర్పడుతాయి. కాని హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ అన్‌హు అలా ఎన్నడు జరుగదు అని సమాధానం ఇచ్చారు. ఈ సలహాను కూడ వారు స్వీకరించలేక పోయారు. అప్పుడు అనుచరులు ఒకవైపు ఉసామా సైన్యం కూడ వెళ్ళిపోయింది, మరోవైపు ప్రజలతో తాత్కాలిక ఒప్పందం కూడ చేసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులలో మరి శత్రువులతో ఎవరు పోరాడుతారు? అని ప్రశ్నించారు. మదీనాలో వృద్దులు, బలహీనులు ఉన్నారు. కేవలం కొంత మంది మాత్రమే నవయువకులు ఉన్నారు. వారు లక్షల మంది శత్రువులను ఎలా ఎదుర్కొగలరు?. అందుకు హజ్రత్ అబూబకర్ రజి వారికి ఇలా సమాధానం ఇచ్చారు. ఓ మిత్రులారా! ఒకవేళ మీరు వారిని ఎదురించలేక పోయినచో అబూబకర్ ఒక్కడే వారిని ఎదురించును. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా తెలిపారు: ఈ వాగ్ధానం యుద్ధ నైపుణ్యమే తెలియని ఒక వ్యక్తి వాగ్ధానం. ఆ వ్యక్తిని గూర్చి సాధారణముగా బలహీన మనస్థత్వం గలవారని ప్రచారం చేస్తుంటారు. అలాంటి వ్యక్తిలో ఈ ధైర్యం, ఈ సహాసం, ఈ నమ్మకం, ఈ పట్టుదల ఎక్కడి నుండి వచ్చాయి? ఈ మాట ద్వారనే నమ్మకం కల్గుతుంది. అనగా హజ్రత్ అబూబకర్ రజి నేను దేవుని వైపు నుండి ఖిలాఫత్ స్థానంలో అధిష్టించబడ్డాను. కావున నాపైనే అని పనుల బాధ్యత ఉన్నది అని అర్థం చేసుకున్నారు.

కావున నా బాధ్యతను నేను నిర్వహిస్తాను. అనగా నేను పోరాడుటకు వెళుృతాను. విజయాన్ని చేకూర్చుడం, చేకూర్చకపోవడం దేవుని ఆధీనంలో ఉన్నది. ఒకవేళ అతడు విజయాన్ని ప్రసాదించదలిచినచో అతడే స్వయముగా ప్రసాదించును. ఒకవేళ ఇవ్వకూడదని తలచుకున్నచో ఎంత పెద్ద సైన్యం ఉన్నను విజయం లభించదు.

(ఖిలాఫతే రాషిదాహ్, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 15, పుట 543-545, ప్రచురణ ఖాదియాన్ 2008)

హజ్రత్ అబూబకర్ రజి నిర్ణాయాలకు ఎంత గొప్ప ఫలితాలు వెలువడ్డాయో చూడండి. ఈ ఆంశంను గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా వ్రాసారు: హజ్రత్ అబూబకర్ రజి అనుచర వర్గీయుల అభిప్రాయానికి భిన్నముగా హజ్రత్ ఉసామా బిన్ జైద్ రజిను సైన్యంతో సహా మౌతా వైపు పంపాడు. మొత్తానికి 40 రోజుల తరువాత ఈ సైన్యం తమ లక్ష్యాన్ని పూర్తి చేసుకొని విజయంతో మదీనాకు చేరుకున్నది. అలా దేవుని సహాయ సహకారాలు అవతరించడాన్ని అందరు తమ కన్నులతో వీక్షించారు. ఈ యుద్ధం తరువాత హజ్రత్ అబూబకర్ రజి అసత్య ప్రకటన చేసి అల్లరులు సృష్టిస్తున్న వారి వైపు దృష్టిని మరల్చారు. ఆ అల్లరులను ఎంతగా అణిచిచేశారనగా నామరూపాలు లేకుండా పోయాయి. ఆ అల్లరులు పూర్తిగా సమాధి చేయబడ్డాయి. ఆ తరువాత ఇస్లాంను వీడి దుశ్చర్యలకు పాల్పడిన వారి పరిస్థితి కూడ ఆ విధముగానే జరిగింది. ప్రముఖ అనుచరులు హజ్రత్ అబూబకర్ రజిను విభేదించసాగారు. పైగా దైవ ఏకత్వంను మరియు దైవ ప్రవక్తను స్వీకరించి కేవలం జకాత్ చెల్లించని వారిపై ఏ విధముగా ఖడ్గాలు ఎత్తబడును ? అని ప్రశ్నించసాగారు. అయినా కూడ హజ్రత్ అబూబకర్ రజి ఎంతో ధైర్యమును, వీరత్వంను ప్రదర్శించారు. ఈ క్రమంలోనే వారు ఇలా అన్నారు. ఒకవేళ ఈ రోజు జకాత్‌కు మినహాయింపు ఇచ్చినచో ప్రజలు నెమ్మది నెమ్మదిగా నమాజ్‌ను, ఉపవాసాలను కూడ వదిలి వేస్తారు. అప్పుడు ఇస్లాం కేవలం పేరుకు మాత్రమే ఉంటుంది అని సమాధానం ఇచ్చారు. మొత్తానికి ఇలాంటి పరిస్థితులలో హజ్రత్ అబూబకర్ రజి జకాత్‌ను నిరాకరించేవారితో యుద్ధం చేశారు. ఫలితము చూసినచో ఈ మైదానంలో కూడ వారి రజికే విజయం లభించినది. సహాయ సహకారాలు అందాయి. తప్పుడు విధానాలను అనుసరించే వారందరు సన్మార్గమును అనుసరించసాగారు. (తఫ్సీరే కబీర్ సంపుటి 10, పుట 478)

ఈ ప్రస్తావన ఇక ముందు కూడ కొనసాగుతుంది. ఇన్షా అల్లాహ్ తదుపరి జుమాలో కూడ ప్రస్తావించెదను.

నేను ముందు నుండే తెల్పినట్లుగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రపంచం కోసం దుఆలు చేయండి. దుఆలలో అలసత్వం చూపకండి. ప్రత్యేకించి ప్రపంచీకులు తమ సృష్టికర్తను గుర్తుంచాలని దుఆ చేయండి. ప్రపంచాన్ని వినాశనం నుండి కాపాడడానికి ఇదొక్కటే మార్గం. అల్లాహ్ తాలా కరుణించుగాకా! మన దుఆలను స్వీకరించుగాకా!.

ఇప్పుడు నేనొక మృతుని గూర్చి ప్రస్తావించెదను. జుమా తరువాత వారి జనాజ నమాజ్‌ను కూడ చదివించెదను. వీరు గౌరనీయులైన మౌలాన ముబారక్ నజీర్ గారు. కెనడాలో ఉన్నటు వంటి జామిఅ అహ్మదియ్యప్రిన్సిఫల్. పైగా ముబల్లిఘ్ ఇంచార్జ్ కెనడా కూడ. మార్చి 8వ తేదిన వీరు 87 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వీరు వసియ్యత్ చేశారు. ఎంతో నిస్వార్థ జీవులు. అల్లాహ్ తాలాపై నమ్మకాన్ని కల్గినవారు. దుఆలు చేసేవారు. పొదుపును ఇష్టపడేవారు. చాలా సాధారణ జీవితాన్ని జీవించేవారు. వారిని చూసిన ప్రతిసారి ఒక నిజమైన మహానుబావుడిని చూసినట్లు అనిపించేది.

వారి వంశంను గూర్చి కూడ ప్రస్తావించెదను. వీరు ఒక విజయవంతమైన ముబల్లిఘ్ సిల్‌సిలా మౌలాన నజీర్ అహ్మద్ అలీ మరియు ఆమినా భేగం గార్ల రెండవ కుమారుడు. వారి వంశంలో అహ్మదియ్యత్ వారి తాతా గారైన హజ్రత్ బాబూ ఫకీర్ అలీ గారి ద్వార వచ్చింది. హజ్రత్ బాబూ ఫకీర్ అలీ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి హస్తంపై బైఅత్ చేశారు. ఆ తరువాత వారు ఖాదియాన్‌లో మొదటి స్టేషన్ మాస్టర్‌గా కూడ కొనసాగారు. ఖాదియాన్‌లో వీరి తాతా గారి భవనం ఫకీర్ మంజీల్ పేరుతో కూడ ఉన్నది. మౌలాన ముబారక్ నజీర్ గారి తండ్రి హజ్రత్ మౌలాన నజీర్ అహ్మద్ అలీ గారు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు ఆదేశాల మేరకు 1929లో మొదట ఘానాలో సేవలందించు భాగ్యమును పొందారు. ఆ తరువాత వారి నియామకం సెరలేవన్‌లో జరిగింది. 1943లో వారి తండ్రి హజ్రత్ మౌలాన నజీర్ అహ్మద్ అలీ గారు సెరలేవన్ తిరిగి వెళ్ళుచుండగా ముబారక్ నజీర్ గారు కూడ తమ తల్లిదండ్రులతో కలసి సెరలేవన్‌కు ప్రయాణమైయ్యారు. ఈ ప్రయాణంలో ఒక విశ్వాస భరిత ఘటన చోటు చేసుకున్నది. మౌలాన ముబారక్ నజీర్ గారు ఆ ఘటనను ఈ విధముగా ప్రస్తావించారు. సముద్ర మార్గం ద్వారా సేరలేవన్‌కు 3 నెలలు ప్రయాణించేవారు. ఆ సమయంలో ముబారక్ నజీర్ గారి వయస్సు 11 సంవత్సరాలు. ప్రయాణ క్రమంలో వారు అనారోగ్యంనకు గురైనారు. జబ్బు ఎంతగా బయటపడిందనగా, ఇక ప్రాణాలు మిగులవు అనే స్థితికి చేరుకున్నది. నేను తెల్పినట్లుగా సముద్ర ఓడలో ప్రయాణం. వారు ఓడను ఎక్కుచున్నారో లేదా ఓడను మార్చుతున్నారో లేక అప్పుడే ఓడను ఎక్కుచున్నారు కావచ్చును. లేదా ప్రయాణించడానికి ముందు జరిగిన ఘటన కావచ్చును. మొత్తానికి ఓడలో ప్రయాణించడానికి ముందు వీరు అనారోగ్యానికి గురైనారు. ఓడలో ఉన్న సిబ్బంది వారి ఆరోగ్య పరిస్థితిని గమణించి వారి తండ్రిని పిలిపించారు. ఆపై వారితో మీ కుమారుడు సగం చనిపోయాడు. ఇక త్వరలోనే పూర్తిగా చనిపోవచ్చును. ఒకవేళ ప్రయాణ మధ్యలో చనిపోయినచో ఓడలో శవాన్ని దాచడానికి ఫ్రీజర్ లేదు. ఎలాంటి సౌకర్యం లేదు. కావున మీ కుమారుడి వలన మేము నిన్ను తీసుకొని వెళ్ళము అని అన్నారు. మౌలానా గారు పదే పదే అభ్యర్థించుకున్నారు. నన్ను ఖలీఫతుల్ మసీహుస్సాని ఆదేశించారు. కావున ఎట్టి పరిస్థితులోనైన నేను వెళ్ళవలసి ఉన్నది అని తెలిపారు. అందుకు ఓడలోని సిబ్బంది ఒక షరతును విధించారు. అదేమనగా ఒకవేళ మీ కుమారుడు మార్గ మధ్యలో మృతి చెందినచో అతని శవాన్ని సముద్రంలో వేయుటకు అనుమతి ఇస్తున్నట్లుగా వ్రాతపూర్వకముగా వ్రాసి ఇవ్వండి. ఓడ యొక్క కెప్టెన్ ఈ షరతును విధించగా ముబారక్ నజీర్ గారి తల్లి ఏడ్వసాగింది. నిస్పృహకు గురైనది. మౌలాన నజీర్ అలీ గారితో ఈ కుమారుడు మన కుమారుడు. కావున మనం మరొక ఓడలో ప్రయాణిద్దాము అని అన్నారు. మౌలానా నజీర్ అలీ గారు తమ భార్యను ఓదార్చారు. నేను ఒక ముబల్లిఘ్‌ను . నన్ను హజ్రత్ గారు ఒక బాధ్యతతో పంపుచున్నారు. రెండవ ఓడ ఎప్పుడు వస్తుందో నాకు ఎం తెలుసు?. నీవు నిశ్చింతముగా ఉండుము. ముబారక్‌కు ఏమికాదు అని నచ్చజెప్పారు. ఆ తరువాత వారు ఓడ యొక్క కెప్టెన్‌తో ఎంతో నమ్మకంతో ఇలా అన్నారు. ఎక్కడ సంతకం పెట్టాలో కాగితాన్ని తీసుకరండి. ఒకవేళ ఇతడు మృతి చెందినచో సముద్రంలో పడేయండి. కాని నేను మీకు మరొక విషయాన్ని తెల్పుచున్నాను. అదేమనగా అతనికి ఏమి కాదు. ఇది వారి తండ్రి గారికి అల్లాహ్ తాలాపై ఉన్న విశ్వాసం.

నమ్మకం. నేను ఒక జీవిత సమర్పితుడిని, అతని ధర్మ విస్తరణ కోసం వెళ్ళుచున్నాను. అల్లాహ్ తాలా తప్పకుండా నాకు సహాయంచేయును. నా కుటుంబీకులను కాపాడును. మొత్తానికి ఆ 11 సంవత్సరాల బాలుడు కేవలం ప్రాణాలతో బయటపడడమే గాకుండా 87 సంవత్సరాల జీవితాన్ని పొందాడు. పైగా ఇస్లాం మరియు అహ్మదియ్యత్‌కు సేవలందించాడు. తమ పూర్వికుల అడుగుజాడలో నడుస్తూ తమ జీవితాన్ని అంకితం చేశాడు. ఆ భాగ్యాన్ని పొందాడు. ధార్మిక సేవలో స్వయముగా అల్లాహ్ తాలాపై గల నమ్మకంలో ఎన్నో ఉన్నత ఉదాహరణను నెలకొలిపారు.

డిగ్రి పూర్తి చేసిన తరువాత వారికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అక్కడ వారు కొన్ని రోజులు ఉద్యోగం కూడ చేశారు. ఆ తరువాత హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ప్రోత్సాహం వలన అల్ ఫజల్‌లో ఉన్నటు వంటి జీవితాన్ని అంకితం చేయండి లేదా తాత్కాలిక అంకితం చేయండి అనే ప్రకటనను చదివి వారు తమ ఉద్యోగానికి రాజినామ చేసి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి సన్నిధిలో తమను తాము తాత్కాలికముగా అంకితం చేసుకోవడం కోసం ప్రవేశపెట్టుకున్నారు. హజ్రత్ ఖలీఫతుస్సాని రజి ఆదేశాల మేరకు 1963లో వారు మొదటి సారిగా వఖ్ఫే అర్జి కోసం సెరలేవన్‌కు వెళ్ళారు. అక్కడ చాలా కాలం పాటు వారి తండ్రి గారైన హజ్రత్ మౌలానా నజీర్ అలీ గారు జమాఅత్‌కు సేవలందించు భాగ్యమును పొందారు. వారి సమాధి కూడ అక్కడే ఉన్నది. మౌల్వీ నజీర్ అలీ గారు అక్కడే సమాధి చేయబడ్డారు. సెరలేవన్ చేరుకోవడం తోనే ముందుగా వారు తన తండ్రి సమాధి వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో వీరు తన తండ్రి గారు మౌలానా నజీర్ అలీ గారు నవంబర్ 26వ తేది 1945న తన ఉపన్యాసంలో పలికిన పలుకులు గుర్తు చేసుకున్నారు. వారు ఇలా అన్నారు. నేడు మనం అల్లాహ్ తాలా కొరకు జిహాద్ చేయడం కోసం మరియు ఇస్లాంను పశ్చిమ ఆఫ్రికాలో వ్యాపింపజేయడం కోసం వెళ్ళుచున్నాము. మరణం, జీవనం మానవునితో ముడిపడి ఉన్నాయి. మనలో నుండి ఒకవేళ ఎవరైన చనిపోయినచో మీరు ఇలా అర్థం చేసుకోగలరు. అనగా ప్రపంచంలో సుదూర ప్రాంతంలో ఒక చిన్న భూభాగం అహ్మదియ్యత్ ఆస్తిఅని మీరు భావించండి. అహ్మదీ నవయువకుల బాధ్యత ఏమిటనగా, వారు అక్కడికి చేరుకోండి, ఏ లక్ష్యము కోసం మనం సమాధుల రూపంలో ఈ భూభాగాన్ని ఆధీన పర్చుకున్నామో ఆ లక్ష్యమును పూర్తి చేయండి. దీని భావమేమనగా అహ్మదియ్యత్ కోసం కొద్ది పాటి భూభాగమే ఉన్నది. అక్కడ ఒక అహ్మదీ ముబల్లిఘ్ సమాధి ఉన్నది. ఆ సమాధి కారణంగా ఆ భూమి ఆధీనంలో ఉన్నది. కావున మా సమాధుల నుండి వచ్చే ఆకాంక్ష ఏమిటనగా మీ పిల్లలకు ఎలా శిక్షణ ఇవ్వవలెననగా, ఏ లక్ష్యము కొరకు మా ప్రాణాలు పోగోట్టుకుంటున్నామో ఆ లక్ష్యాన్ని పూర్తి చేయుటకు ప్రయత్నించు వారు కావాలి. ఈ క్రమంలోనే వారు తమ తండ్రి గారి ఆకాంక్షను నెరవేర్చుటకు మౌలానా ముబారక్ నజీర్ గారు అక్కడికి చేరుకొని తన తండ్రి సమాధి వద్దనిలబడి ఆ లక్ష్యాన్ని నేరవేర్చుటకు నేను సిద్ధముగా ఉన్నాను, మీ పిలుపుకు సమాధానం ఇవ్వడానికి వచ్చాను అని సమాధానం ఇచ్చారు.

సేరలేవన్‌కు చెందిన అనేక ప్రాంతాలలో వారికి సేవ చేయు భాగ్యము లభించినది. ఆ తరువాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ ఆదేశాల మేరకు 1985లో పాకిస్తాన్‌కు తిరిగి వచ్చారు. 1985లో వీరు ఆఫ్రికా నుండి తిరిగి వచ్చిన తరువాత వారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ సేవలో తాత్కాలిక అంకింతను గాకుండా వారు శాశ్వత జీవిత అంకితమును సమర్పించుకున్నారు. హుజూర్ అన్వర్ అంగీకరించారు. ఆ తరువాత వారిని ఒక ముబల్లిఘ్‌గా 1988లో కెనడాకు పంపించారు. అక్కడ కూడ వీరు అనేక ప్రాంతాలలో ముబల్లిఘ్‌గా సేవలందించారు. 2003లో కెనడాలో జామిఅను ప్రారంభించాలని నిర్ణయించు కున్నప్పుడు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబెహ్ రహ్మ గారు అందుకు అనుమతి నిచ్చారు. ఆ తరువాత ప్రిన్సిఫల్‌గా కూడ వీరినే నియమించారు. కాని హుజూర్ రహ్మ కాలంలో జామిఅ ప్రారంభించబడలేదు. తరువాత నా కాలంలో ప్రారంభించడం జరిగింది. నేను కూడ అదే విధముగా కొనసాగునట్లుగా ఆదేశాలు జారి చేశాను.

| అహాదీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)***

అనగా వీరే ప్రిన్సిఫల్‌గా కొనసాగుతారు అని చేసిన నియామకాన్ని కొనసాగించాను. మొత్తానికి వీరు జామిఅ అహ్మదియ్యకెనడాకు ప్రిన్సిఫల్‌గా కొనసాగారు. 2009 వరకు వీరు జామిఅలో ప్రిన్సిఫల్‌గా కొనసాగారు. 2010లో కెనడా మిష్నరీ ఇంచార్జ్ బాధ్యతలు కూడ వీరికే అప్పగించబడ్డాయి. 2018 వరకు వీరికి చాలా సేలందించు భాగ్యము లభించినది. వీరు మొత్తం 59 సంవత్సరాలు జమాఅత్‌కు సేవలందించారు. తాత్కాలిక జీవితం అంకితము కూడ శాశ్వత జీవిత అంకితమే. ఈ విధముగా మౌలానా గారికి కేంద్రీయ ప్రతినిధిగా ఎన్నో జల్సాలలో, కార్యాక్రమాలలో పాల్గొనే అవకాశం లభించినది. వారి ఉపన్యాసాలను మనవారు, ఇతరులు చాలా ఇష్టపడుతారు. చాలా ప్రభావం చూపే ఉపన్యాసాలు శ్రోతలను పూర్తిగా తమవైపు ఆకట్టుకుంటాయి. 2016లో వీరికి నా ప్రాతినిధ్యంలో గోయిటేమాలాలో నూర్ ఆసుపత్రికి శంకుస్థాపన చేయు భాగ్యము లభించినది. ఇవియే గాకుండా వీరి ప్రచార వ్యాసాలు కూడ ప్రచురించబడేవి. కెనడాయొక్క జాతీయ వార్తల సంస్థ, టొరాంటొ స్టార్ మరియు ఆటో స్టేషన్ వంటి పత్రికలలో ప్రచురిత మయ్యేవి. మౌలాన ముబారక్ నజీర్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పుస్తకం తజల్లియాతే ఇలాహీ మరియు ఫతహ్ ఇస్లాంను ఆంగ్లంలోకి అనువాదించు భాగ్యమును పొందారు. ఆ తరువాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ గారి రచన గల్ఫ్ క్రైసెస్‌ను కూడ వారు అనువాదించారు.

వారి జ్ఞాపకార్థం వారి శ్రీమతి అమతుల్ హాఫీజ్ నజీర్‌తో పాటు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నేను ముందుగా తెల్పినట్లుగా వీరు చాలా ప్రత్యేకతను కల్గియున్నారు. ఒక ఆదర్శవంతమైన జీవిత సమర్పితులు. మురబ్బీల కోసం ప్రత్యేకించి ఒక ఉదాహరణ. వీరి జీవితం ధర్మమును ప్రాపంచికతపై ప్రాధాన్యత నిచ్చుటకు ఒక గొప్ప ఆచరణాత్మక చిత్రం. ఎల్లప్పుడు జమాఅత్‌కు సేవలందించేవారు ఖలీఫగారి ఆదేశాలను తమ లక్ష్యముగా పెట్టుకునేవారు. నేను తెల్పినట్లుగా వీరికి ఉపన్యాసంలో నేర్పు గలదు. ఉర్దూ మరియు ఆంగ్ల భాషలలో చాలా పట్టు ఉన్నటు వంటి వారు. చాలా ప్రభావితం చేయు ఉపన్యాసం చేసేవారు. వీరి శ్రీమతి అమతుల్ హాఫీజ్ గారు ఇలా వ్రాసారు: జీవితమంతయు చాలా ఉత్తమముగా, నిష్టాపరతతో జీవించారు. జమాఅత్ యొక్క ఒక్కొక్క పైసాకు విలువ నిచ్చేవారు. ఎంతో సాధారణమైన జీవితాన్ని గడిపారు. సెరలేవన్ ను వీడిన తరువాత కూడ అక్కడి చాలా మంది పేదవారికి నిరంతరం మౌనంగా సహాయం అందించేవారు. మరల ఇలా వ్రాసారు: వారు ఉత్తమమైన జీవిత సమర్పితులని, ఉత్తమమైన భర్త అని, కరుణా స్వభావం గల తండ్రి అని నేను సాక్ష్యమిస్తున్నాను. జమాఅత్ నాపై ఇంతగా ఖర్చు చేస్తుందని మరి నేను జమాఅత్‌కు ఎలా ప్రయోజనాన్ని చేకూర్చగలను అని ఎల్లప్పుడు చింతించేవారు. ఖలీఫాగారి కోపాన్ని నేను ఎట్టి పరిస్థితుల్లో భరించలేను అని కూడ పదే పదే అనేవారు.

వారి పిల్లలు కూడ ప్రభావిత అంశాలను వ్రాసారు. అధికులు ఒకే విధముగా వ్రాసారు. తండ్రిగారికి అల్లాహ్ పై మరియు పరలోక జీవితంపై చాలా పటిష్టమైన నమ్మకం ఉండేది. ఖిలాఫత్ పట్ల వినయవిధేయతలను ప్రదర్శించేవారు, జమాఅత్ వ్యవస్థను పూర్తి నమ్మకం ఉండేది. అల్లాహ్ తాలాపై ఎక్కువ నమ్మకం ఉండేది. అల్లాహ్ తాలా నన్ను ఎన్నడు వదిలి వేయదు, ఎల్లప్పుడు నాకు సహాయం అందిస్తాడు అని అనేవారు. అల్లాహ్ తాలా కూడ వారితో అలాగే వ్యవహరించేవారు. ఆర్థిక ప్రోత్సహాల కోసం ఎక్కడికి వెళ్ళినా, వీరు మిష్నరి ఇంచార్జ్‌గా ఉన్నప్పుడు కూడ అమీర్ గారు వీరిని ఎక్కడికి పంపించినా, ఆ సమయంలోనే గాకుండా పదవి విరమణ చేసిన తరువాత వారు అనారోగ్యంనకు గురైయ్యారు. అయినా కూడ వారిని ఆర్థిక ప్రోత్సహాల కోసం పంపించగా, వారు ఎక్కడికి వెళ్ళిన కూడ ప్రజలను ప్రభావితులను చేసేవారు. అందుకు కారణం ముందుగా వారు తమ వంతు భాగాన్ని చెల్లించేవారు ఆ తరువాత ఇతర జమాఅత్ సభ్యులను ప్రోత్సహించేవారు.

వీరి పెద్ద కుమార్తె ఇలా వ్రాసారు: ఖిలాఫతే అహ్మదియ్యాతో పటిష్టమైన అనుబంధాన్ని కల్గియుండే సలహా ఇచ్చేవారు. ఎల్లప్పుడు మాలో జమాఅత్ పట్ల ప్రేమ, గౌరవంను పెంపొందించుటకు ప్రయత్నించేవారు. మేము ఎల్లప్పుడు ఖలీఫతుల్

| అహాదీస్ బోధనలు | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)***

మసీహ్ ఆదేశాలకు అనుగుణముగా నడుచుకోవాలని ఆకాంక్షించేవారు. మరల ఇలా వ్రాసారు: ఈ అంశాలను గూర్చి ప్రస్తావించని సమావేశం ఎక్కడో ఒక్కటి ఉంటుంది. వీరి మనుమలు మనుమరాల్లు ఒకచోట ఏకమైనచో మాఅందరిని కూర్చొబెట్టి నచ్చజెప్పుతారని అర్థం చేసుకునేవారము. వారు చేసే సూచనలలో ప్రాపంచిక పనులలోనే నిమగ్నం కాకూడదని తెలియజేసేవారు. మేము అల్లాహ్ తాలాతో మరియు ఖిలాఫత్‌తో పటిష్ట అనుబంధాన్ని ఏర్పర్చుకున్నట్లుగా నమ్మకాన్ని కల్గించమని కోరేవారు. మరల ఇలా వ్రాసారు: జమాఅత్ పనులు పూర్తిగావించబడుతాయి. ఇందులో ఎలాంటి సంశయం లేదు. ఒకవేళ మీరు జమాఅత్‌కు సేవ చేయనిచో అల్లాహ్ తాలా మీకంటే ఉత్తములైన వారిని తీసుకవచ్చి పనులు పూర్తి చేయించు కుంటాడు అని మమ్ములను పదే పదే హెచ్చరించేవారు.

మరల వారి చిన్న కుమార్తె ఇలా వ్రాసారు: సెరలేవన్‌లో ఒక మస్జిద్ నిర్మాణ క్రమంలో పనివారు కూలి డబ్బులు అడిగారు. మస్జిద్ నిర్మాణం కొనసాగుచున్నది. డబ్బులు అయిపోయాయి. ఆ సమయంలో తండ్రి గారి వద్ద వారికి ఇవ్వడానికి డబ్బులు లేకుండెను. అయినా కూడ మౌలాన ముబారక్ నజీర్ గారువారితో మీరు రేపు రండి, మీ కూలి డబ్బులు ఇస్తాను అని సమాధానం ఇచ్చారు. మీ కూలి డబ్బులు మీకు ఇచ్చేస్తాను అని అన్నారు. ఉదయం కాగానే ముబారక్ నజీర్ గారు ఇంట్లో నుండి బయటికి వెళ్ళారు. అప్పటికే పనివారు వచ్చి ఎదురుచూస్తూ ఉండడాన్ని వారు గమనించారు. అప్పటి వరకు డబ్బులు ఏర్పాటు కాలేదు. అందుకు వారు వారితో ఇంకా నా వద్ద డబ్బులు ఏర్పాటు కాలేదు. మీరు ఇంకా కొంత సమయం ఇవ్వండి నేను దుఆ చేస్తాను, ఇన్నా అల్లాహ్ అల్లాహ్ తాలా త్వరగానే ఏర్పాటు చేస్తాడు అని అన్నారు. అంతలోనే ఒక వాహనం వేగంగా అక్కడికి వచ్చింది. అందులో నుండి ఒకరు ఒక కవరును ఇచ్చారు. అందులో డబ్బులు ఉన్నాయి. ఆ వ్యక్తి ఇలా అన్నాడు. మీరు మస్జిద్ నిర్మిస్తున్నారని చెప్పుకొను చుండగా ఒకరు విన్నారు. అందుకే వారు ఈ డబ్బులను పంపించారు. మీరు వీటిని తీసుకోండి అని అన్నారు. మా తండ్రి ఈ డబ్బుల కవరును ఎవరు ఇచ్చారని అడగడానికి ముందే ఆ వ్యక్తి వేగంగా తన వాహనాన్ని తీసుకొని వేగంగా వెళ్ళిపోయాడు. మొత్తానికి తండ్రిగారికి అల్లాహ్ తాలా వారి దుఆలను విన్నాడనే నమ్మకం కల్గింది. ఆ విధముగా వారు కూలీలకు డబ్బులు చెల్లించారు.

వారికి అల్లాహ్ తలాపై ఉన్న నమ్మకం ఇది. అల్లాహ్ తాలా కూడ వారితో ఆ విధముగానే వ్యవహరించాడు. ఇలాంటి నమ్మకం మరియు అల్లాహ్ తాలా వ్యవహారంల అనేక సంఘటనలు ఉన్నాయి. అనేక మంది వ్రాసారు. మురబ్బీలు కూడ వ్రాసారు. నేను తెల్పినట్లుగా ఖచ్చితముగా వారు ఆచరణాత్మకమైన ధర్మ పండితులు. అందుకోసమే వారి ఉపన్యాసాలు ప్రజలను ప్రభావితులను చేస్తాయి. కాని ఖిలాఫత్ ముందు వారు ఎంతో విధేయతతో నడుచుకునేవారు.

అల్లాహ్ తాలా వారి స్థాయిని పెంచుగాకా! వారి సంతానాన్ని వారి అడుగు జాడలలో నడిపించుగాకా! వారి దుఆలకు వారి సంతానాన్ని వారసులుగా చేయుగాకా! అల్లాహ్ తాలా జమాఅత్ ఇలాంటి నిస్వార్థ సేవకులను అధికముగా అనుగ్రహించు గాకా!. ప్రత్యేకించి కెనడా జామిఅలో విద్యను అభ్యసించిన మురబ్బీలు వారిని గూర్చి అనేక సంఘటనలను వ్రాసారు. ఏ విధముగా వారు క్రమశిక్షణ ఇచ్చేవారు, ఏ విధముగా వారికి ప్రచారం చేయాలో నేర్పించారు, ఏ విధముగా ఉన్నత లక్షణాలను ప్రదర్శించాలో నేర్పించారు. అదే విధముగా ధర్మమును ఏ విధముగా నేర్పించారో కూడ వ్రాసారు. మొత్తానికి ఆ మురబ్బీలందరు వారి నుండి చాలా ప్రయోజనాన్ని పొందారు. కావున వారు ఈ విషయాలను గుర్తుంచుకోవాలి. ఈ విషయాలు కేవలం గుర్తుంచుకోవడం కోసం, ఇతరులకు వినిపించడం కోసం కాదు. మురబ్బీలు కూడ ఈ విధముగా నడుచుకోని ఇతరులకు ఆదర్శవంతులుగా నిలవాలి. అల్లాహ్ తాలా వారికి ఈ భాగ్యమును అనుగ్రహించుగాకా!. (ఆమీన్)

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | “అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. ” (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

(2వ పేజీ తరువాత చదువుము)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇట్లనిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్అవ్వల్ (రజి) మృతి చెందిన గృహములోని ఆ గదికి నేను మౌల్వీ ముహమ్మద్ అలీ గారిని పిలిచి, ఇట్లన్నాను. ఖిలాఫత్ అవసరమా! అవసరము లేదా! అను విషయములో ఎలాంటి వివాదము చేయకండి. ఎవరి చేతిలో జమాఅత్‌నకు ప్రయోజనము కలుగును! ఇస్లాం ప్రగతి చెందును! అను విషయము వరకే మీ అభిప్రాయములను పరిమితం చేయగలరు. త్యాగము సమర్పించవలసిన విషయములలోనే సంధి ఏర్పడవచ్చును. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇట్లనిరి. నేను మౌల్వీ గారితో ఇట్లంటిని. వ్యక్తిగత భావముల విషయమునకు వచ్చినచో నేను నా భావములను మీ కొరకు త్యాగము చేయగలను. కాని నియమముల విషయము ఎదురైనచో తప్పదు. ఎందుకనగా నియమములను వీడుట ఎట్టి పరిస్థితిలో సబబు కాదు. మాకు, మీకు మధ్య గల భేదమేమనగా మేము ఖిలాఫత్‌ను ఒక ధార్మిక విషయముగా భావించుచు, అనివార్యమని విశ్వసింతుము. కాని మీరు ఖిలాఫత్‌ను అసమంజసమని అనలేరు ఎందుకనగా ఇప్పుడిప్పుడే మీకు ఒక ఖలీఫా బైఅత్ నుండి స్వాతంత్ర్యయము లభించినది. అనగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్అవ్వల్ (రజి) బైఅత్ మీరు చేసియుండిరి. ఇప్పుడు వారు మృతి చెందిరి. ఇప్పుడు మీకు దానితో స్వాతంత్ర్యము లభించినది. మాకు ఖిలాఫత్ వద్దు, మేము ఖిలాఫత్ నుండి స్వాతంత్ర్యము పొందినారని మీరంటున్నారు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ వారితో ఇట్లనిరి. ఆరు సంవత్సరముల వరకు మీరు బైఅత్ చేసియున్నారు. ఆరు సంవత్సరముల వరకు ధర్మబద్ధమైన విషయము, తరువాత నిషేధము కాలేదు. అల్లాహ్ తాలా ఆజ్ఞతో యున్న విషయమును వీడలేము. మీ, మా పొజిషన్‌లో తేడా ఏమనగా మీరు మీ విషయమును వీడినచో ఇప్పటి వరకు ఆచరించిన దానినే మీరు ఆచరించవలసి వచ్చును. కాని మేము మా విషయమును వీడినచో అది మా విశ్వాసము, ధర్మమునకు వ్యతిరేకమగును. దానికి వ్యతిరేకంగా మేమెన్నడు ఆచరించలేదు. నేటి వరకు మీరు అనుసరించిన దారినే ఇప్పుడు కూడ అనుసరించుట న్యాయము. మమ్ములను మా ధర్మము, నియమమునకు విరుద్ధముగా చేయుటకు బలవంతము చేయకండి. హజ్రత్ మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇట్లనిరి. జమాఅత్ ప్రగతి, ఇస్లాం స్థాపన కొరకు ఎవరు మేలు అను ప్రశ్న ఇప్పుడు మిగిలియున్నది. మీరు ఏ వ్యక్తితో ఏకీభవింతురో ఆ వ్యక్తిని మేము ఖలీఫాగా అంగీకరింతుము. అల్లాహ్ తాలా కృపానుసారము జమఅత్‌లోని అధికులు ఖిలాఫత్ వ్యవస్థ ఏర్పడాలని కోరుచుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టమైన ఆదేశము జమాఅత్ ముందుండెను. ఈ సమావేశము ఎక్కువ పొడుగైనప్పుడు మౌల్వీ ముహమ్మద్ అలీ గారు మొండిగా వ్యవహరించుచు పోయిరి. ప్రజలు తలుపులను కొట్టడం మొదలు పెట్టి త్వరగా నిర్ణయము తీసుకొని, మా బైఅత్ తీసుకోగలరని అనిరి. మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇంకా ఇట్లనిరి. నేను మీ సందేహములను దూరము చేసినాను, కనుక ఖలీఫా ఎవరను ప్రశ్న ఇప్పుడు మీ ముందుండవలెను తప్ప ఖలీఫా వుండాలా వద్దా అను ప్రశ్న కాదు. అందుకు మౌల్వీ గారిట్లనిరి. మీరెందుకు పట్టుబడుచున్నారో నాకు తెలుసు. ఖలీఫా ఎవరగుదురో మీకు తెలుసు. ఎవరగుదురో నాకు తెలియదని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) సమాధానమిచ్చిరి. మౌల్వీ ముహమ్మద్ అలీ గారితో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) ఇంకా ఇట్లనిరి. మీరు ఎన్నుకొనిన వ్యక్తిపై నేను బైఅత్ చేయుదును. ఖిలాఫత్‌ను ఆశించే ప్రజలు నా మాట వింటున్నారు. కనుక వ్యతిరేకత ఎదురయ్యే ప్రశ్నే లేదు. కాని మౌల్వీ గారు నమ్ముటకు సిద్ధముగా లేకుండిరి. అందుకే నమ్మలేదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు ఇంకా ఇట్లనిరి. నేను వారితో ఇట్లంటిని. మీరు నా గురించి చేయుచున్న అనుమానముల గురించి నేను మీకు నా హృదయము ఎట్లు చీల్చి చూపించగలను. ఏ త్యాగము నేను చేయగలనో దానికి నేను సిద్ధముగా యున్నాను. కొంత సమయము తరువాత ద్వారము తెరువబడెను. వారు బయటికి వచ్చారు. (తదుపరి సంచికలో)


సాబిర్ బుర్ఖా హౌజ్ ఖాదియాన్



SABIR BURQA HOUSE
ALL TYPES OF READYMADE BURQA
ఫోన్ ద్వారా ఆర్డర్లు పంపినచో బుర్ఖాలు
కోరియర్ ద్వారా కూడా పంపబడును
CIVIL LINES ROAD, OPP: FOUR STORY QADIAN
CONTACT NO:98884 45694 (SABIR AHMAD)

(12వ పేజి తరువాత) నవ యువకులు కావునా వారి ఆలోచనలకు అనుగుణముగా కార్యక్రమాలు చేపట్టడి.

వివాహ సంబంధాలకు చెందిన ఎడిష్నల్ శిక్షణ కార్యదర్శిని ఉద్దేశించి హుజూర్ అన్వర్ ఇలా సూచించారు. వివాహ శాఖ మరియు శిక్షణ శాఖల బాధ్యత ఏమిటనగా వారు యువకులకు ధర్మమునకు ప్రాపంచికతపై ప్రాధాన్యతనిచ్చునట్లు అలవాటును  నేర్పించాలి. అదే విధముగా యువతుల ధార్మికతను చూసి తమ ధార్మికతను కూడ సరి చేసుకోవాలి. అంతేగాని ప్రపంచం కోసం పరుగులు తీయవద్దు. కట్నకానుకలను గాకుండా యువతి ధార్మికురాలా? కాదా? చూడాలి. యువకులు స్వయముగా ధార్మికతను అనుసరించినప్పుడే వారు ధార్మికతకు ప్రాధాన్యతని వ్వగలరు.

అదే విధముగా నూతన అహ్మదియ్యుల కార్యదర్శి బాధ్యత ఏమిటనగా, వారు జమాఅత్‌లో చేరునట్టి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలి. అట్టి కార్యదర్శిని ఉద్దేశించి మరల ఇలా అన్నారు: విభిన్న జాతుల వారు జమాఅత్‌లో చేరుతారు కావున వారి ప్రాథమిక విద్య మరియు వారి ప్రాథమిక అవగాహనను అనుసరించి వారి కొరకు కార్యక్రమాలను ఏర్పాటు చేయండి. ఒకవేళ ఎవరైన క్రైస్తవం నుండి వచ్చినచో, హైందవం నుండి వచ్చినచో, సిక్కుల నుండి వచ్చినచో, నాస్తికుల నుండి వచ్చినచో లేదా ముసల్మానుల నుండి వచ్చినచో వారికి వేరు వేరు కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. కావున ఈ విషయంలో వారిని వ్యక్తి గతంగా కలిసి వారి కోసం వేరుగా కార్యక్రమాలను చేపట్టండి. అప్పుడే వారి విశ్వాసం చాలా పటిష్టం అవుతుంది.

నూతన అహ్మదీయుల కోసం రాహే ఈమాన్ అనే సంచికను మజ్లిస్ నుండి అందిస్తున్నామని, అందరిని దృష్టిలో ఉంచుకొనియే వ్యాసాలను ప్రచురిస్తున్నాము అని కార్యదర్శి గారు హుజూర్ అన్వర్‌కు తెలియజేశారు. అందుకు హుజూర్ అన్వర్ గారు ఇలా అన్నారు: ఇది చాలా మంచి పని. కాని వారి స్పందనను కూడ అడిగి తెలుసుకోండి. ఒక్కసారి స్పందనను తెలుపడం గొప్పకాదు. వాస్తవం ఏమిటనగా, ఒక వస్తువును ఇచ్చినప్పుడు అది అతని వరకు చేరిందా? లేదా? ఒకవేళ చేరినచో దాని ద్వారా అతడు ప్రయోజనాన్ని పొందినాడా? లేదా? ఒకవేళ ప్రయోజనం పొందినచో దాని ఫలితముగా అతనిలో ఎలాంటి మార్పు వచ్చింది?. ఇలాంటి అంశాలన్ని వారి స్పందనలో తెలుసుకోవాలి. ఇలాంటి స్పందనలు మీకు రావడం కూడ మంచిదే. ఒకవేళ ఖుద్దాముల్ అహ్మదియ్యకు ఇలాంటి స్పందన వచ్చినచో నూతన అహ్మదీయులలో ఒక విప్లవాన్ని సృష్టించారని అర్థం చేసుకోవచ్చును. అప్పుడు ఆ నూతన అహ్మదీయులు పటిష్ట విశ్వాస వంతులు అవుతారు. క్రమశిక్షణ కార్యక్రమాల వలన ఎలాంటి ఫలితాలు వెలువడుతున్నాయి అనే సమాచారం మీ వద్దకు తప్పకుండా రావాలి.

మరల ఇలా తెలిపారు: నోటి మాటలు చేప్పడం, ఉపన్యాసాలు చేయడం గొప్ప విషయం కాదు. నేను ఇక్కడి నుండి జుమా ప్రసంగాన్ని ఇస్తుంటాను. ప్రపంచంలో అధికులు వింటూంటారు. నా జుమా ప్రసంగం ఎవరిపై ప్రభావం చూపిందో నాకు తెలియనిచో నా ప్రసంగం వలన ఏం ప్రయోజనం?. అదే విధముగా మీ వ్యాసాల పరిస్థితి కూడ. వాటి ప్రభావాల ఫలితాలు మీకు చేరనంత వరకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని అర్థం. కావున ఈ స్పందన వ్యవస్థను కూడ వేగవంతం చేయడం.

హుజూర్ అన్వర్ ఖాదియాన్‌కు చెందిన కార్యదర్శికి మార్గదర్శకాలు ఇస్తూ ఇలా అన్నారు: ఖాదియాన్‌కు చెందిన యువకులు మరియు పిల్లల క్రమశిక్షణ ఇతర ప్రాంతాల వారి కంటే ఉత్తమముగా, ఉన్నతమైన ప్రామాణికాలకు అనుగుణముగా ఉండాలి. ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలి. నేను మార్గదర్శకాలు పంపాను. కావున ఆయా కార్యక్రమాలను ఖాదియాన్‌లో ఏ విధముగా అమలు చేస్తున్నారు అనే విషయాన్ని మీరే చూసుకోవాలి. ఖాదియాన్ మజ్లిస్ ఒక ఆదర్శవంతమైన మజ్లిస్‌గా నిలవాలి. అప్పుడే ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారు అక్కడి వారిని చూసి ఈ యువకులు, పిల్లలు నిజంగా తమకు ఆదర్శవంతులు అని , వారిని అనుసరించాలని వారు భావిస్తారు. అంతేగాని ఒకవేళ ఇతర ప్రాంతాల వారు వచ్చిచూసినచో స్వయముగా మీ అలవాట్లు అభిరుచులు సరిగా లేకపోవడం, క్రమశిక్షణ లేకపోవడం, నమాజ్‌ల విషయంలో నిర్లక్ష్యం, ఖుర్‌ఆన్ మజీద్ పారాయణం చేయడంలో అలసత్వం, అస్సలాము అలైకుం అని పలకడానికి మోహమాటం, ప్రాథమిక గుణగణాలు సరిగా లేకపోవడం వంటి వాటిని చూసినచో వారు మంచి అభిప్రాయాన్ని ఏర్పర్చుకోవడానికి బదులుగా చెడు అభిప్రాయాన్ని ఏర్పర్చుకుంటారు. కావున మీరు ఇలాంటి పరిస్థితులను గూర్చి కూడ ఆలోచించాలి. మీరు ప్రపంచానికి ఆదర్శవంతులుగా నిలవాలి. ప్రత్యేకించి మీ దేశ యువకులు మరియు పిల్లలకు. కావున ఇటు వైపు ప్రత్యేకమైన శ్రద్ధను కనబర్చవలెను.

హుజూర్ అన్వర్ మరల అడిగి తెలుసుకోగా ప్రధాన కార్యదర్శి ఇలా వివరణ ఇచ్చాడు: శుక్రవారం రోజున ప్రతి మస్జిద్ వద్ద మరియు ఇతర జమాఅత్ కార్యక్రమాల సమయంలో క్రమం తప్పకుండా యువకులు డ్యూటీలు ఇస్తున్నారు. అందుకు హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: 15, 16 సంవత్సరాల యువకులను నిలబెట్టకండి, అవగాహన కల్గిన యువకులను, సేన్సిబుల్ యువకులను డ్యూటిలపై నియమించాలి. ఒకవేళ ఏదేని అత్యవసర పరిస్థితి వచ్చినచో వెంటనే నిర్ణయం తీసుకునే సామార్థ్యం కూడ ఉండాలి. లేదా పరిష్కార మార్గలను చూపువారై తమ ఇంచార్జ్‌లకు తెలుపు సామార్థ్యం ఉండాలి. ఇలాంటి శిక్షణాపరమైన సూచనలను కూడ వారి ముందు ఉంచాలి.


ఈ విషయంను గూర్చి అన్ని మజాలిస్‌లకు సర్క్యులర్స్‌ను పంపుతున్నామని కార్యదర్శి సమాధానం ఇచ్చాడు. అందుకు హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: డ్యూటి ఇచ్చేవారు ఆయా సర్క్యులర్స్‌ను చదివారా? లేదా? అని కూడ పరిశీలించి చూసుకోవాలి. ఇక్కడి యువకులకు కూడ సరైన శిక్షణ ఇవ్వండి. అదే విధముగా ఖాదియాన్ పరిసరాలను కూడ నిశితంగా పరిశీలిస్తూనే ఉండాలి. అనేక స్వభావాలు కల్గిన ప్రజలు ఇక్కడ ఉన్నారు. వివిధ రకాల ప్రజలు ఉంటున్నారు. పరిస్థితులకు అనుకూలంగా క్రమశిక్షణను పాటించు అవగాహన మీకు ఉండాలి. కావున ఇటు వైపు మీరు ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలి. ఇందుకు చెందిన వారపు నివేధికను తప్పకుండా సదర్‌కు అందజేయాలి.

మరల ఇలా తెలిపారు: ఖాదియాన్ పరిస్థితులను శ్రద్ధగా పరిశీలించండి. ఎక్కడ ఎలాంటి లోటుపాటులు కనిపించిన వెంటనే సదర్‌కు తెలియజేయండి. సదర్  సంబంధిత కార్యదర్శిని మరియు క్రమశిక్షణలను, ఇతర వ్యవస్థలన్నింటిని సరి చేసి లోటుపాటులను దూరం చేయడానికి ప్రయత్నిస్తాడు. ఎక్కువ మందితో మమేకం కావడానికి ప్రయత్నించండి. అప్పుడే క్రమశిక్షణ నుండి ప్రయోజనాలను పొందవచ్చును. క్రమశిక్షణ శాఖ సరిగా పని చేసినచో  ఇతర శాఖలన్ని వాటికి అవే చక్కబడిపోతాయి. ఏది ఏమైనప్పటికి పరిసరాలన్నింటిపై దృష్టిని కేంద్రీకరించండి. మస్జిద్‌లను పర్యవేక్షించండి. ఖాదియాన్ నగరంలో, బెహిస్తి మఖ్బరహ్‌లో డ్యూటీలు ఇవ్వడం, దారుల్‌మసీహ్‌లో డ్యూటీలు ఇవ్వడం వంటివి చాలా ప్రత్యేకమైన డ్యూటీలు.

విద్యాశాఖ కార్యదర్శిని ఉద్దేశించి హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: చిన్న చిన్న మజ్లిస్‌లకు ప్రత్యేక శ్రద్ధను కేటాయించి శిక్షణనివ్వండి. ఇందుకు ఎక్కువ సమయాన్ని కేటాయించండి. నగర మజాలిస్‌లకు వేరే సమస్యలుంటాయి. కావున వాటికి అనుగుణముగా వారి కోసం ధార్మిక, లక్షణ పరమైన కార్యక్రమాలను వేరుగా నిర్వహించండి. వేరే విధముగా వారికి నేర్పించడానికి ప్రయత్నించగలరు.

హుజూర్ అన్వర్ మరల ఇలా అన్నారు: కొన్ని కొన్ని ప్రాంతాలలో ఎక్కువ విద్యాభ్యాసం చేసిన వారు ఉంటారు. కొన్ని ప్రాంతాలలో నిరక్ష్యరాస్యులుంటారు. కొందరు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పుస్తకాలను అర్థం చేసుకోలేని వారు కూడ ఉంటారు. ఎందుకనగా వారికి చదవడం రాదు.ఆయా ప్రాంతాలలో ఉర్దూ భాష అంతగా వాడుకలో ఉండదు. ఆయా చోట్ల కొన్ని పదాలు కఠినముగా ఉచ్చరించబడుతాయి. వాటిని అంత తెలికగా అర్థంచేసుకోలేము. కావున ఆయా ప్రాంతాల వారికి వాటిని అర్థమయ్యేల చెప్పడం కోసం ఇతరుల సహాయంను తీసుకోవలసి ఉంటుంది. ఆడియో పుస్తకాలను కూడ ఉపయోగించవచ్చును. మీరు ఇలాంటి ప్రణాళికను రూపొందించాలి. 100శాతం యువకులను ఇందులో చేర్చవలెను. ఆయా పుస్తకాలను చదివించవలెను. (తదుపరి సంచికలో)



EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 7. Thursday, 12 MAY 2022 Issue No. 19.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.575/- (Per Issue: 11/- ) (WEIGHT: 20-50, grms / issue)

దివి 10 ఏప్రిల్ 2021 నాడు అంతర్జాతీయ్య అహ్మదియ్య జమాఅత్ ఇమాం అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారితో జాతీయ ఖుద్దాముల్ అహ్మదియ్య ఉపశాఖ కార్యవర్గం ఆన్‌లైన్ ద్వారా సమావేశమయ్యే భాగ్యమును పొందినది. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పవిత్రమైన నగరం ఖాదియాన్ దారుల్ అమాన్‌కు చెందిన ఒక బృంధంతో హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఆన్‌లైన్ ద్వారా సమావేశం నిర్వహించడం ఇదే ప్రప్రధమం. హుజూర్ అన్వర్ సమావేశానికి ఇస్లామాబాద్ (టెల్‌ఫోర్డ్)లో ఉన్నటు వంటి తమ కార్యాలయం నుండి అధ్యక్షత వహించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు ఖాదియాన్‌లో ఉన్నటు వంటి ఖుర్‌ఆన్ కరీం ప్రదర్శన ప్రాంగణంలో ఉంటూ ఈ శుభప్రదమైన కార్యక్రమములో పాల్గొన్నారు. 65 నిమిషాల వరకు కొనసాగిన ఈ సమావేశంలో ప్రతి కార్యవర్గ సభ్యుడు తమ శాఖకు చెందిన నివేదికను వినిపిస్తూ అనేక విషయాలలో హుజూర్ అన్వర్ నుండి మార్గదర్శకాలను, సూచనలు, సలహాలను పొందు భాగ్యమును పొందారు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ప్రదాన కార్యదర్శికి నివేదికల ప్రాధాన్యతను తెల్పుచూ ఇలా అన్నారు: మీ ఖాయిద్‌లను ఏ విధముగా ఉత్సాహోవంతులుగా తీర్చిదిద్దాలనే ప్రాపర్ ప్లానింగ్ మీరు ముందే చేసుకోవాలి. ఒకవేళ స్థానిక ఖాయిద్ సరిగా పని చేయనిచో అట్టి ఖాయిద్‌తో పని చేయించండి అని జిల్లా ఖాయిద్‌ను పదే పదే సంప్రదించండి. ఒకవేళ జిల్లా ఖాయిద్ సరిగా పని చేయనిచో అట్టి ఖాయిద్‌తో పని చేయించండి అని ప్రాంతీయ ఖాయిద్‌ను పదే పదే సంప్రదించండి. మొత్తానికి క్రమం తప్పకుండా నివేదికలు చేరుకునేలా ఒక విధానాన్ని అనుసరించాలి. కేవలం నివేదికలకే పరిమితం కాకుండా పని కూడ చేస్తుండాలి. ప్రస్తుతం కరోన వలన పర్యటనలు చేయడం లేదు. కావున స్థానిక మరియు ప్రాంతీయ ఖాయిద్‌లను సంప్రదిస్తూ సమీప మజాలిస్‌ల పర్యటన చేస్తూ ఖాయిద్‌లను ఉత్సాహోపర్చాలని సూచించండి. మీ సమీక్షలలో ఎవరు మంచిగా పని చేస్తున్నారు?, ఎవరు మంచిగా పని చేయడం లేదు? ఎవరు నివేదికలను పంపుచున్నారు? ఎవరు పంపడంలేదు? అనే ఆంశాలు కూడ ఉండాలి. సమీక్ష జరుపాలి. ప్రతి నెల ప్రాంతీయ మరియు జిల్లా ఖాయిద్‌లు తమ తమ మజాలిస్‌లలో పర్యటించాలి. అప్పుడే వారికి తమ ఖాయిద్‌లను ఎలా ఉత్సాహవంతులుగా తీర్చి దిద్దాలనే విషయం అర్థమవుతుంది. ముందుగా ప్రతి స్థానిక ఖాయిద్‌తో మీకు అనుబంధం ఉండాలి. ఆ తరువాత వారి పనిని మేరుగు పర్చడం కోసం వారితో పదే పదే సంప్రదింపులు కొనసాగించాలి.

హుజూర్ అన్వర్ జననగణన కార్యదర్శితో కరోనా సమయంలో కూడ జనన గణన పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచిస్తూ ఇలా అన్నారు: ముందు ఎవరెవరి ఇంటికి వెళ్ళేవారో వారిని కరోనా కారణంగా ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించండి. చాలా వరకు చిన్న మజాలిస్‌లు ఉన్నాయి. కావున ప్రతి స్థానిక ఖాయిద్‌కు తమ పరిదిలో ఎన్ని ఇళ్ళు ఉన్నాయి? వాటిలో ఎంత మంది యువకులు ఉన్నారు? అనే విషయాలు తెలిసి ఉండాలి. కావున వారి నుండి డాటాను తీసుకున్నచో పూర్తి వివరాలు లభిస్తాయి. జనన గణాంకాల వివరాలు క్రింది స్థాయి నుండి సేకరించాలి. ప్రతి స్థానిక జమాఅత్ నుండి, ప్రతి స్థానిక మజ్లిస్ నుండి యువకుల సంఖ్యను సేకరించాలి. అంతేగాని జమాఅత్ కార్డులు ఉన్నాయి కదా అని వాటినే ఆధారం చేసుకోకండి. జమాఅత్‌కు తనకంటూ ఒక వ్యవస్థ ఉన్నది. కొన్ని సందర్భాలలో ఖుద్దాముల్ అహ్మదియ్య, అన్సారుల్లాహ్ మరియు లజ్నా ఇమాఉల్లాహ్ వ్యవస్థలు జమాఅత్ వ్యవస్థలకు భిన్నముగా ఉంటాయి. కొన్ని సందార్భలలో వారే జమాఅత్‌కు సమాచారంను అందిస్తుంటారు. కావున మీరు వాటిని చులకనగా చూడకూడదు. ఖుద్దాముల్ అహ్మదియ్యకు ప్రత్యేక సమాచార వ్యవస్థ వేరుగా ఉండాలి. ప్రతి సంవత్సరం అన్ని ప్రాంతాల నుండి ఫారాలు నింపబడి కార్యాలయానికి చేరుకోవాలి.

హుజూర్ అన్వర్ కార్యదర్శితో ఇలా ముచ్చటించారు: ప్రతి సంవత్సరం స్థానిక ఖాయిద్‌ల నుండి ఫారాలు వస్తున్నాయా?, ఎంత మంది క్రొత్తగా ఖుద్దాములలో చేరుకున్నారు?, ఎంత మంది అన్సార్‌లకు వెళ్ళిపోయారు? అని చూసుకోవాలి. మరల ఇలా తెలిపారు: నెలవారి నివేధికలో కూడ జనన గణన ప్రస్తావన ఉంటుంది. మరొకటి సంవత్సరం ప్రారంభంలో యవకుల సంఖ్యను నిర్ధారించు ఫారాలు నింపిస్తారు. మీకు సంబంధించిన జనన గణన కార్యదర్శి ప్రతి కుటుంబ డాటాను పూర్తి చేసి పంపిస్తారు. తద్వారా క్రొత్త వారు ఎంత మంది చేరారు?. పాతవారిలో ఎంత మంది అన్సార్ శాఖకు వెళ్ళిపోయారు? అనే విషయం తెలుస్తుంది.

జనాభా నివేధికను సూచించు ఫారమును గూర్చి అవి మజాలిస్ నుండి వస్తున్నాయా? అని అడిగారు. అందుకు కార్యదర్శి ఆ ఫారాలు రాలేదు అని సమాధానం ఇచ్చారు. ఆ క్రమంలోనే హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: అందుకు కారణం మీరు గణన నివేధకను పట్టించుకోవడం లేదు. మాసపు నివేధిక పట్ల కూడ నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంవత్సర ప్రారంభంలోనే ప్రతి మజ్లిస్ నుండి గణన నివేధికను తెప్పించుకోవడానికి మీరు అధిక ఆసక్తిని కనబర్చాలి. అప్పుడే మీకు పూర్తి స్థాయిలో గణాంకాలు తెలుస్తాయి. పూర్తి శ్రద్ధ చూపినప్పుడే 973 మజాలిస్‌ల నుండి 973 గణన నివేధికలు అందుతాయి. అప్పుడే మీకు సరైన డాటా లభిస్తుంది. అందుకు అనుగుణముగా మీరు సరైన కార్యక్రమాలను రూపొందించుకోవచ్చును. ఈ గణాంకాల నివేధిక పనియే అతి ప్రధానమైన పని. మొదటి 2 మాసాలలోనే ప్రతి ఇంటి నుండి, ప్రతి మజ్లిస్ నుండి మీకు నివేధికలు రావాలి. సరేనా?. ఆ తరువాత నివేధికలు సరిగా వచ్చినా రాకపోయినా ఎలాంటి సమస్య ఉండదు. గణాంకాల నివేధిక ఫారము వేరుగా చేరుకోవాలి. అంతేగాని మాస నివేధికతో గణాంకాల నివేధికకు ఎలాంటి సంబంధం ఉండదు. సంవత్సరం ప్రారంభపు 2 మాసాలలో ఈ ఆంశంపైనే అధిక శ్రద్ధను కనబర్చాలి.

హుజూర్ అన్వర్ క్రమశిక్షణ కార్యదర్శితో అన్ని మజాలిస్‌లతో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా మరియు స్థానిక ఖాయిద్‌ల సహాయం తీసుకొమ్మని కూడ తెలిపారు. మరల ఇలా అన్నారు: క్రమశిక్షణ కార్యక్రమము కూడ చాలా ముఖ్యమైన కార్యక్రమము. కావున మీరు ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలి. ఫలితముగా అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి. మన ముందుకు వచ్చే చిన్న చిన్న ఫిర్యాదులు, గొడవలు వంటివి అవే సద్దుమణిగిపోతాయి. మీరు ఖాదియాన్‌లో కూర్చొని కార్యక్రమాలను రూపొందిస్తారు. నిజానికి మీ భారత దేశం చాలా విశాలమైనది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క స్వాభావికులు, ఒక్కొక్క సమస్యలు, ఒక్కొక్క సాంప్రదాయాలు ఉంటాయి. విభిన్న సాంప్రధాయకులు ఉన్నారు. కావున ఆయా సమాజంలో ఉండేఅహ్మదీయులకు ఏ కోణంలో క్రమ శిక్షణ ఇవ్వాలి అనే విషయాన్ని కూడ పరిగణలోకి తీసుకోవాలి. వారి బలహీనతలను పూర్తిగా దూరం చేయడం లేదా వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడం కొరకు ప్రయత్నించాలి. ఇందుకోసం ఒక ప్రత్యేక ప్రణాళిక కూడ ఏర్పాటు చేసుకోవాలి. శిక్షణ తరగతులది ఒక ప్రత్యేక కార్యక్రమము. ఆయా ప్రాంతాలకు అనుగుణముగా, వారి సమస్యలకు అనుగుణముగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి. వాటిని కూడ మీరు వేరుగా నిర్వహించండి. ఖుద్దాముల్ అహ్మదియ్య ఈ విధముగా పని చేస్తూ, వారిని తీర్చిదిద్దినచో రాబోయే తరాలవారు కూడ తీర్చిదిద్దబడతారు. ధార్మికతకు ప్రాపంచికతపై ప్రాధాన్యతను ఇచ్చెదమనే వాగ్ధానంను నినాదంగా చేసుకోవాలి. అప్పుడే వారికి ధర్మంను నేర్చుకోవాలనే ఆకాంక్ష పుడుతుంది. వారికి తెలిసినప్పుడు దానికి ప్రాధాన్యతను ఇచ్చెదరు. అసలు ధర్మము అంటే ఏమిటో తెలియనప్పుడు, జమాఅత్ సాంప్రదాయాలను గూర్చి వారికి తెలియనప్పుడు, వారికి మీరు ఎలా క్రమ శిక్షణను ఇవ్వగలరు?. లేదా వారు తమ సామార్థ్యములను ఏ విధముగా జమాఅత్ కొరకు ఖర్చు చేయుదురు?.కావున మనం వివిధ ప్రాంతాల వారికి వివిధ కోణాలలో ఏ విధముగా కార్యక్రమాలను నిర్వహించగలము? అని చూసుకోవాలి. కేంద్రియ కార్యక్రమాలు సర్వసాధారణం. అవి కాకుండా కూడ ఇతర కార్యక్రమాలను నిర్వహించండి. అంతేగాని తూ తూ మంత్రంగా చేపట్టవద్దు. క్రొత్తగా ఆలోచించండి. (11వ పేజిలో చదవండి)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz